KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :85 | ఆదివారం , 22 ఫిబ్రవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-




## శ్రీశైలం లెఫ్ట్ కెనాల్ టన్నెల్‌లో

# ప్రమాదం!


శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం పనుల్లో శనివారం ప్రమాదం చోటు చేసుకుంది. ఎడమవైపు సొరంగంలో 14 కిలోమీటర్లు దాటిన తర్వాత.. ఈ ప్రమాదం జరిగింది. ఉదయం ఎనిమిదిన్నర సమయంలో.. సొరంగ మార్గంలో సుమారు మూడు మీటర్ల మేర పైకప్పు కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పది మంది కూలీలకు గాయాలైనట్టు తెలుస్తుండగా.. పులువురు కార్మికులు టన్నెల్ లోపలే చిక్కుకుపోయినట్టు సమాచారం. ప్రమాదం జరిగిన సమయంలో లోపల సుమారు 35 మంది కార్మికులు ఉన్నారని తెలుస్తోంది. ఉదయం షిఫ్ట్‌లో పనులకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

ఐదేళ్ల సుధీర్ఘ విరామం తర్వాత.. నాలుగు రోజుల కిందటే పనులు ప్రారంభమైన సంగతి తెలిసిందే. నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో.. పనులు జరుగుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గాయపడిన వాళ్లు, లోపల చిక్కుకుపోయిన కార్మికులంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారుగా తెలుస్తోంది. కాగా.. హుటాహుటిన రంగంలోకి దిగిన అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన కార్మికులను స్థానిక జెన్‌కో ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఇప్పటి వరకు ముగ్గురు కార్మికులను బయటకు తీసుకురాగా.. తీవ్రంగా గాయాలైనట్టు తెలుస్తోంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

2లో

## ‘కారు’ ఇక

# టాప్ గేరు



2లో

- ప్రజా సమస్యలపై పోరు కేటీఆర్ సారథ్యం
- హరీశ్‌కు పార్టీ నిర్మాణం, శిక్షణ, సిల్వర్ జూబ్లీ నిర్వహణ బాధ్యతలు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, ప్రజా సంఘాలతో సమన్వయం కవితకు
- 30 మందితో కోర్ గ్రూప్
- ప్రజా సమస్యలపై పోరు
- కొత్త వ్యూహాలకు పదును
- ప్రజాసంఘాలను కలుపుకునేందుకు వ్యూహం
- తెలంగాణ సెంటిమెంట్ అస్త్రం

(శ్రీధర్ యాలాల - సీనియర్ జర్నలిస్ట్, పొలిటికల్ అనాలిస్ట్)

గత ఏడాది ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైలెంట్ అయిపోయారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో తప్ప ఆయన ఫార్మ్ హౌస్ కె పరిమితమయ్యారు. కాంగ్రెస్ పాలనకు ఏడాది సమయం ఇవ్వాలన్న ఆలోచనతో కేసీఆర్ బయటకు రాలేదు. సిఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు ఎంత రెచ్చగొట్టినా కేసీఆర్ మాత్రం మౌనమే సమాధానం అన్నట్టు ఉండి పోయారు. ఇప్పుడు ఏడాది పూర్తయింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తుంది. ఈ ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు, జీహెచ్ ఎంసీ ఎన్నికల నేపథ్యంలో పార్టీని పునర్నిర్మించాలని, ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఈ నెల 19 వ తేదీన బీఆర్ఎస్ విస్తృత స్థాయి భేటీలో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఈ మేరకు సంకేతాలు ఇచ్చారు.

అలాగే బిఆర్ఎస్ ఈ ఏడాది ఏప్రిల్ 27 నాటికి 25 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో ఏడాది పొడవునా పార్టీ రజతోత్సవాల నిర్వహణకు సన్నద్ధమవుతోంది. మరోవైపు సంస్థాగత నిర్మాణంతో పాటు ప్రజా సమస్యలపై ఉద్యమించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలోనే పార్టీ కీలక నేతల మధ్య పని విభజన ద్వారా అన్ని వర్గాల ప్రజలకు చేరువ కావడంపై దృష్టి సారించింది. ఉద్యమకాలంలో కలిసి నడిచిన శక్తులకు తిరిగి దగ్గర కావాలని నిర్ణయించింది. తెలంగాణ అస్తిత్వాన్ని మరోసారి గుర్తు చేస్తూ పార్టీ భావజాలాన్ని వ్యాపింపజేయాలనే అభిప్రాయంతో ఉంది. తద్వారా కొత్త తరాన్ని ఆకర్షించే ఎత్తుగడలకు పదును పెడుతోంది. ఈ నెల 19న జరిగిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి భేటీలో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఈ మేరకు సంకేతాలు ఇచ్చారు. కీలక నేతలకు ముఖ్య బాధ్యతలు పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడంతో పాటు అన్ని స్థాయిల్లో యంత్రాంగాన్ని సమన్వయం చేసేందుకు కీలక నేతల నడుమ పని విభజన చేయాలని కేసీఆర్ నిర్ణయించారు.

### పూర్తి సహకారం అందిస్తాం..

## సురక్షితంగా తీసుకురండి..

సీఎం రేవంత్‌కు ప్రధాని మోదీ ఫోన్..!



శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం పనుల్లో అపశ్రుతి చేసుకుంది. టన్నెల్ పైభాగం ఒక్కసారిగా కృంగిపోయింది. నాగర్ కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో ఎడమవైపు సొరంగం 14 కిలోమీటర్ దగ్గర ఈ ప్రమాదం జరిగింది. 42 మంది కార్మికులను సురక్షితంగా బయటకు రాగా.. 13 మందికి గాయాలయ్యాయి. మరో 8 మంది లోపల చిక్కుకున్నారు.

2లో

## సీఎం చేతగాని తనానికి

### SLBC ఘటన నిదర్శనం

### - కేటీఆర్, హరీష్ రావు ఫైర్!

ఎస్ఎల్‌బీసీ సొరంగం ఘటనపై పూర్తి బాధ్యత సీఎం రేవంత్ రెడ్డిదేనని కేటీఆర్ అన్నారు. సుంకిశాల రీటైనింగ్ వాల్ కూలిన ఘటన మరువకముందే మరో దుర్ఘటన జరగడం బాధకరమన్నారు. ఇది కాంగ్రెస్ సర్కారు వైఫల్యానికి నిదర్శనమంటూ హరీష్ రావు సైతం మండిపడ్డారు.

# రేవంత్ జుట్టు

### చంద్రబాబు చేతిలో ఉంది

**కవిత**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జుట్టు చంద్ర బాబు చేతిలో ఉంది.. చంద్రబాబు జుట్టు ప్రధాని మోదీ చేతిలో ఉందన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రి ఉండటం తెలంగాణ ప్రజలు చేసుకున్న దురదృష్టం అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్..

### జనాభా లెక్కల్లోనే లేరు

### : సీఎం రేవంత్ రెడ్డి




2 లో

కేసీఆర్ ,కేటీఆర్, హరీశ్ రావు జనాభా లెక్కల్లోనే లేరన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఇన్ని అవకాశాలు ఇచ్చిన.. వాళ్లు కులగణన సర్వేలో పాల్గొనలేదన్నారు. కులగణన సర్వే లెక్క తప్పైతే ఎట్ల తప్పో వచ్చి చూపించాలన్నారు రేవంత్. ప్రతిపక్షాలు మొండిగా..తొండిగా వాదిస్తున్నారని విమర్శించారు రేవంత్.

## తెలంగాణలో కొలువుల జాతర..

**భారీ నోటిఫికేషన్లకు గ్రీన్‌సిగ్నల్**

తెలంగాణ ప్రభుత్వం మరో భారీ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సిద్ధం అవుతోంది. మహిళా శిశు సంక్షేమ శాఖలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.




2 లో

## రేవంత్ పాలనలో

# తిరోగమన దిశగా తెలంగాణ

- భారీగా తగ్గిన ఆదాయం
- స్పష్టం చేసిన కాగ్ నివేదిక
- రెవెన్యూ రాబడుల అంచనా 55.96 శాతం మాత్రమే... 7.24 శాతం తగ్గుదల
- ఆదాయాన్ని దెబ్బతీసిన హైడ్రా
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఆదాయం 31.94 శాతం మాత్రమే.. గత ఏడాది 63.24 శాతం.. 52% తగ్గుదల
- రాష్ట్రానికి నేరుగా వచ్చిన ఆదాయంలో అప్పులదే పెద్ద పద్దు
- కేంద్రం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్స్ కేవలం 23.93 శాతమే వచ్చాయి
- రెవెన్యూ మిగులు రూ.297.42 కోట్లు ఉంటుందని అంచనా కానీ రూ.8,758.83 కోట్ల లోటుకు చేరుకుంది
- అప్పులు రూ.1.30 లక్షల కోట్లకు పై మాటే



2 లో

వాస్తవిక లెక్కలతో తాము బడ్జెట్ ప్రవేశ పెడుతున్నామని అసెంబ్లీలో గొప్పలకు పోయిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. తమ చర్యల మూలంగా తెలంగాణ ఆర్థిక మూలాలను ఎంతలా దెబ్బతీసిందో తేటతెల్లమైంది. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో మొదటి పది నెలలకు గాను జమాపద్దుల వివరాలను కాగ్ వెల్లడించింది. జనవరి నెలకు సంబంధించిన గణాంకాలను చూస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో కనీసం 70 శాతం అంచనానైనా చేరుకుంటామా అనే సందేహం కలుగుతోంది.

2024 - 25 వార్షిక బడ్జెట్‌లో అన్ని రకాల ఆదాయం రూ.2,21,243.23 కోట్లు వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. జనవరి నెలాఖరుకు ఇందులో రూ.1,23,815 కోట్లు మాత్రమే ఆమ్దానీ సమకూరింది. ఇది మొత్తం రెవెన్యూ రాబడుల అంచనాలో 55.96 శాతం మాత్రమే.. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి 63.20 శాతం ఆదాయం సమకూరగా ఈసారి 7.24 శాతం ఆదాయం తగ్గిపోయింది.

రాష్ట్ర ఆదాయాన్ని హైడ్రా ఎంతలా దెబ్బతీసిందో గణాంకాలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఆదాయం రూ.18,228.28 కోట్లుగా అంచనా వేయగా జనవరి వరకు 5,821.88 కోట్లు మాత్రమే వచ్చాయి.

## మోదీ తలకిందులుగా తపస్సు చేసినా..

### రాహుల్ గాంధీ వంద జోడో యాత్రలు చేసినా..

### ఈ అభివృద్ధిని సాధించలేరు

### : కేటీఆర్




2 లో

దేశ ప్రధాని నరేంద్ర మోదీ తలకిందులుగా తపస్సు చేసినా.. రాహుల్ గాంధీ మరో వంద జోడోయాత్రలు చేసినా.. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో గత పదేండ్లలో జరిగిన అభివృద్ధిని సాధించలేరు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. గత పదేళ్లు కేసీఆర్ మొక్కవోని పట్టుదలతో తెలంగాణలో అభివృద్ధి యజ్ఞం చేశారు.. అని కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన నివేదికనే చెప్తున్నది అని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

## సీఎం రేవంత్


### సవాల్‌ను స్వీకరిస్తున్నా: కిషన్‌రెడ్డి



2 లో

## నేటిమాట

“చీకటిలో కదలిక లేకుండా నిలబడడం కన్నా, వెలుతురులో వెళ్ళిపోవడం మేలైనది




-రవీంద్రనాథ్ ఠాగూర్

## మీరిద్దరే KR బ్రదర్స్..

### సవాల్ చేస్తే అవన్నీ బయటపెడతా..

### కేంద్రమంత్రి బండి



2 లో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి బండి సంజయ్ రక్షణ కవచంగా నిలిచారని.. వీరిద్దరూ ఆర్ఎస్ బ్రదర్సేనంటూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సంజయ్ తీవ్రస్థాయిలో స్పందించారు. కాంగ్రెస్‌పై పోరాడుతున్న చరిత్ర బీజేపీ పార్టీదేనని.. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. పనీపాట లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# శ్రీశైలం లెఫ్ట్ కెనాల్ టన్నెల్‌లో ప్రమాదం!

మొదటి పేజీ తరువాయి

## ప్రమాదంపై సీఎం రేవంత్ స్పందన

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద జరిగిన ప్రమాదంపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టన్నెల్ వద్ద పైకప్పు కూలి పలువురికి గాయాలైన సమాచారం అందిన వెంటనే రేవంత్ రెడ్డి.. అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, అగ్నిమాపక శాఖ, హైడ్రా, ఇరిగేషన్ విభాగం అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు అందించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్య నాథ్ దాస్, ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక హెలీకాప్టర్‌లో ప్రమాదం జరిగిన ప్రాంతానికి బయలుదేరారు.

నల్గొండ జిల్లాకు సాగు, తాగు నీరందించేందుకు శ్రీశైలం ఎడమగట్టు కాలువ(%టూదీజ%) సొరంగం ప్రాజెక్టును రూపొందించారు. 2005లో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు నాటి వైఎస్సార్ ప్రభుత్వం రూ.2,200 కోట్లతో పరిపాలన అనుమతులు జారీ చేసింది. రూ.1925 కోట్లతో సుమారు 60 నెలల్లో పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ పనులు పొందింది. శ్రీశైలం జలాశయం నుంచి నల్గొండ జిల్లాకు 30 టీఎంసీల కృష్ణ జలాలను తరలించాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం.

## టన్నెల్‌లో చిక్కుకున్న వారిని కాపాడుతున్నాం.. మంత్రి ఉత్తమ్

శనివారం ఉదయం నాగర్? కర్నూల్? జిల్లా దోమలపెంట సమీపంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఎడమవైపు సొరంగం 14వ కిలోమీటర్ వద్ద మూడు మీటర్ల మేర పైకప్పు కూలింది. పలువురు కార్మికులు బయటకు రాగా.. మరికొందరు టన్నెల్‌లోనే చిక్కుకుపోయారు. ఘటనాస్థలాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. " శనివారం ఉదయం 8 గంటలకు కార్మికులు టన్నెల్ లోపలికి వెళ్లారు. 8.30 గంటలకు బోరింగ్ మిషన్ ఆన్ చేశారు.

టన్నెల్‌లో ఓవైపు నుంచి నీరు లీకైంది. దీంతో మట్టి కుంగి పెద్ద శబ్దం వచ్చింది. టీబీఎం ఆపరేటర్ ఈ ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టారు. 42 మంది కార్మికులు అప్రమత్తమై వెంటనే బయటికి వచ్చారు. అయితే బోరింగ్ మిషన్ ముందున్న 8 మంది అందులోనే చిక్కుకుపోయారు. వాళ్లను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆ 8 మంది ప్రాణాలు కాపాడేందుకు కృషి చేస్తున్నాం. ఉత్తరాఖండ్‌లో ఇలాంటి ఘటన జరిగినప్పుడు టన్నెల్‌లో చిక్కుకున్న వాళ్లని బయటకి తీసిన రెస్క్యూ నిపుణులతో మాట్లాడాం.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకుపోయివారు ఝార?ండ్, ఉత్తరప్రదేశ్ వాసులు. వాళ్లలో ఒక ప్రాజెక్టు ఇంజినీరు, ఫీల్డ్ ఇంజినీర్, నలుగురు కార్మికులు ఉన్నారు. అలాగే జమ్మూకశ్మీర్, పంజాబ్‌కు చెందిన ఇద్దరు బోరింగ్ మిషన్ ఆపరేటర్లు ఉన్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న వాళ్లకి వెంటిలేషన్ ఇబ్బంది లేదు. 14 కిలోమీటర్ల లోపల ఇరుక్కుపోవడంతో వాళ్లని బయటకు తీయడం సవాలుగా మారింది. శనివారం రాత్రికి రెస్క్యూ బృందాలు ఘటనాస్థలానికి చేరుకుంటాయని" మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.

# 'కారు' ఇక టాప్ గేరు

మొదటి పేజీ తరువాయి

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్ కు క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, వాటి అమలు బాధ్యతను అప్పగించనున్నారు. ఇప్పటికే ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన రైతు ధర్నాల్లో పాల్గొన్న కేటీఆర్.. ప్రభుత్వ వైఫల్యాలపై భవిష్యత్తులో జరిగే ఆందోళనలు, నిరసన కార్యక్రమాలకు నేతృత్వం వహించనున్నారు.

సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుకు పార్టీ సంస్థాగత నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఇప్పటికే కేసీఆర్ ప్రకటించారు. ఏప్రిల్ 10న ప్రారంభమయ్యే పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు గ్రామ, వార్డు, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల కూర్పు, పార్టీ శిక్షణ కార్యక్రమాలు తదితరాలను హరీశ్ పర్యవేక్షిస్తారు. పార్టీ రజతోత్సవాల నిర్వహణ బాధ్యతలను కూడా హరీశ్‌రావుకే అప్పగించనున్నట్లు సమాచారం.


అనుబంధ సంఘాలపై కవిత దృష్టి ఇప్పటికే బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు సంబంధించిన అంశాలపై దృష్టి కేంద్రీకరించి పనిచేస్తున్న ఎమ్మెల్సీ కవిత.. పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేసే దిశగా ఇప్పటికే కార్యాచరణ అమలు చేస్తున్నారు. మహిళా రిజర్వేషన్లు, కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వంటి అంశాలపై కవిత వరుస సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.

### ఉద్యమ శక్తుల ఏకీకరణ

యువతకు చేరువ ఉద్యమ కాలంలో పార్టీతో కలిసి వచ్చిన వ్యక్తులు, శక్తులకు తిరిగి దగ్గర కావాలనే అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 27 నుంచి ఏడాది పొడవునా సాగే పార్టీ రజతోత్సవాల్లో ఉద్యమంలో కలిసి వచ్చిన కవులు, కళాకారులు, రచయితలు, వివిధ జేఏసీల్లో క్రియాశీలంగా పనిచేసిన వారితో కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తద్వారా తెలంగాణ అస్తిత్వాన్ని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తు చేయడంతో పాటు కొత్త తరానికి తెలంగాణ నేపథ్యం, రాష్ట్ర సాధన ఉద్యమం తదితరాలను పరిచయం చేయాలని, పార్టీ భావజాలాన్ని వ్యాపింపజేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో బీఆర్ఎస్ పాత్ర, పదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసేలా కార్యక్రమాలు రూపొందించనున్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సమయంలో పుట్టిన పసికందులు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తున్న యువతగా ఎదిగారు. వారిలో తెలంగాణ అస్తిత్వ స్ఫూర్తిని రగిలించేలా సదస్సులు, సమావేశాలు, సభలు నిర్వహించాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

### కోర్ గ్రూప్

ఈ కార్యక్రమాలకు రూపకల్పన బాధ్యతను పార్టీలోని కొందరు ముఖ్య నేతలకు అప్పగించనున్నారు. కార్యాచరణ రూపకల్పనకు కోర్ గ్రూప్ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చలు, ప్రణాళికల రూపకల్పనకు సుమారు 25 నుంచి 30 మంది సీనియర్ నేతలతో కోర్ గ్రూప్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ గ్రూప్‌లో ఉద్యమ కాలం నుంచి పార్టీలో పనిచేసిన నేతలతో పాటు వివిధ సందర్భాల్లో పార్టీలో చేరిన సీనియర్లకు చోటు కల్పిస్తారు. ఎర్రవల్లి నివాసంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని కూడా భావిస్తున్నారు. వ్యవసాయ క్షేత్రంలో భోజనశాల, పార్కింగ్ తదితర వసతుల కల్పన పూర్తయిన తర్వాత మినీ సభలను తలపించేలా ఈ సమావేశాలు జరగనున్నాయి.



# పూర్తి సహకారం అందిస్తాం..

## సురక్షితంగా తీసుకురండి.. సీఎం రేవంత్‌కు ప్రధాని మోదీ ఫోన్..!

మొదటి పేజీ తరువాయి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరా తీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రధాని మోదీ ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను ప్రధాని మోదీకి వివరించారు సీఎం రేవంత్ రెడ్డి. సొరంగంలో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకున్నారని, వారిని కాపాడేందుకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టామని ప్రధానికి తెలిపారు. సహాయక చర్యలను మంత్రులు ఉత్తమ్ కుమార్? రెడ్డి, జూపల్లి కృష్ణారావు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని ప్రధానికి సీఎం రేవంత్ వివరించారు. పూర్తిస్థాయి సహకారం అందించేందుకు కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు ప్రధాని మోదీ

ఐదేళ్ల సుధీర్ఘ విరామం తరువాత తిరిగి ఈ మధ్యే ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల కిందటే ఈ ప్రాంతంలో పనులు చేపట్టారు. అయితే ఉదయం 8.20 గంటల సమయంలో సొరంగమార్గం దగ్గర టన్నెల్ బోర్ మిషన్ బురదలో చిక్కుపోయింది. సుమారు మూడు మీటర్ల మేర సిమెంట్ సెగ్మెంట్స్ కుంగిపోయాయి. దీంతో కార్మికులు, సిబ్బంది లోపలే చిక్కుకుపోయారు.

టన్నెల్‌లో రింగులు విరిగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోగా అధికారులు దానిని పునరుద్ధరించారు. టన్నెల్ 14వ కిలోమీటర్ వద్ద నాలుగు అడుగుల మేర నీరు చేరింది. దీంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. లోపల ఉన్నవారికి రక్షించేందుకు కేంద్ర ఆర్మీని సాయం కోరింది తెలంగాణ ప్రభుత్వం. దీంతో సహాయక చర్యల కోసం వెంటనే ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తామని సీఎం రేవంత్ రెడ్డికి ప్రధాని మోదీ తెలిపారు. లోపల ఉన్నవారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.



# రేవంత్ పాలనలో తిరోగమన దిశగా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

ఇది మొత్తం అంచనాలో 31.94 శాతం మాత్రమే. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఆదాయం 63.24 శాతంగా ఉంది. హైడ్రా పేరుతో బుల్డోజర్లను పరుగెత్తించి నిర్మించిన ఇండ్లను కూల్చేయడంతో ప్లాట్లు, ఫ్లాట్లు, ఇండ్ల కొనుగోళ్లు క్షీణించాయి. ఆ ప్రభావం రాష్ట్ర ఖజానాపై భారీ ఎత్తున పడింది.

రాష్ట్రానికి నేరుగా వచ్చిన ఆదాయంలో అప్పులదే పెద్ద పద్దుగా ఉంది. అప్పులు, ఇతర రూపాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.49,255.41 కోట్లు సమకూర్చుకుంటామని బడ్జెట్‌లో ప్రతిపాదించగా జనవరి నెలాఖరుకు రూ.58,586.64 కోట్ల అప్పులు తెచ్చారు. అంచనాకు మించి పది నెలల్లోనే 19 శాతం అప్పు అదనంగా తెచ్చారు. జీఎస్టీ, సేల్స్ ట్యాక్స్, ఎక్సైజ్ ఆదాయమే రాష్ట్ర ఖజానాకు కాస్త దన్నుగా నిలిచింది. జీఎస్టీ రూపంలో ఆదాయం రూ.58,594.91 కోట్లుగా అంచనా వేయగా జనవరి వరకు రూ.42,657.90 కోట్లు సమకూరాయి. మొత్తం అంచనాల్లో ఇది 72.80 శాతం.. నిరుటితో పోల్చితే జీఎస్టీ ఆదాయం 1.79 శాతం తక్కువగా వచ్చింది. సేల్స్ ట్యాక్స్ రూపంలో రూ.33,449.21 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా రూ.33,449.21 కోట్లుగా అంచనా వేయగా రూ.26,725.57 కోట్ల ఆదాయం సమకూరింది. స్టేట్ ఎక్సైజ్ డ్యూటీస్ రూపంలో రూ.25,617.53 కోట్లుగా అంచనా వేయగా రూ.15,585.35 కోట్ల ఆదాయం వచ్చింది. కేంద్ర పన్నుల్లో వాటాగా రూ.18,384.19 ఆదాయం వస్తుందని లెక్కగట్టగా రూ.15,336.44 కోట్లు వచ్చింది. ఇతర పన్నుల రూపంలో రూ.10,111.78 కోట్లకు గాను రూ.6,644.56 కోట్ల ఆదాయం వచ్చింది.

కేంద్రం నుంచి పెద్ద ఎత్తున గ్రాంట్ ఇన్ ఎయిడ్స్ వస్తాయని అంచనా వేసినా వాస్తవ రూపం దాల్చలేదు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో 21,636.15 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా 5,176.72 కోట్లు మాత్రమే వచ్చాయి. అంచనాల్లో 23.93 శాతం ఆదాయమే గ్రాంట్స్ రూపంలో వచ్చింది. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ ఎక్స్‌పెండిచర్ రూపంలో ప్రభుత్వం రూ.2,20,994.81 కోట్లు ఖర్చు చేస్తుందని అంచనా వేయగా జనవరి నెలాఖరుకు రూ.1,49,866.10 కోట్లు ఖర్చు చేశారు. ఇది మొత్తం వ్యయం అంచనాలో 67.83 శాతంగా ఉంది. ఇందులో అప్పులకు వడ్డీ చెల్లించేందుకు రూ.22,056.20 కోట్లు, ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు రూ.35,555.87 కోట్లు, పెన్షన్లు ఇచ్చేందుకు రూ.14,153.85 కోట్లు, సబ్సిడీలకు రూ.11,303.75 కోట్లు ఖర్చు చేశారు. క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ రూపంలో 28,311.89 కోట్లు ఖర్చు చేశారు. మొత్తం అంచనాలో ఇది 86.46 శాతంగా ఉంది.

బడ్జెట్లో రెవెన్యూ మిగులు రూ.297.42 కోట్లు ఉంటుందని అంచనా వేయగా రూ.8,758.83 కోట్ల లోటుకు చేరుకుంటుందని కాగ్ అంచనా వేసింది. ద్రవ్యలోటు బడ్జెట్‌లో రూ.31,525.63 కోట్లుగా అంచనా వేయగా అది కాస్త రూ.36,530.44 కోట్లకు చేరుతుందని స్పష్టం చేసింది. హైడ్రా బుల్డోజర్ పాలనతో రాష్ట్ర ఆమ్దానీ గణనీయంగా దెబ్బతినడంతో అప్పులు చేయడం మినహా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందు ఇంకో మార్గం లేకుండా పోయింది. ఇప్పటికే ప్రభుత్వం బడ్జెట్ కు లోబడే రూ.58 వేల కోట్ల అప్పు చేసింది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో మరో 20 వేల కోట్ల అప్పులు తెచ్చేందుకు ఆర్‌బీఐ వద్ద ప్రయత్నిస్తోంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ పరిధిలో చేసే అప్పులే రూ.80 వేల కోట్లకు చేరే అవకాశాలున్నాయి. కార్పొరేషన్‌ల ద్వారా తెచ్చే అప్పులు, భూములు కుదువ పెట్టి సమకూర్చుకునే ఆదాయం కూడా లెక్కలోకి తీసుకుంటే అప్పులు రూ.1.30 లక్షల కోట్లకు పైమాటే ఉంటుందని అంచనా.

# సీఎం చేతగాని తనానికి SLBC ఘటన నిదర్శనం - కేటీఆర్, హరీష్ రావు ఫైర్!

మొదటి పేజీ తరువాయి

### మధ్యాహ్నం వరకు చలనం లేదు..

నాలుగు రోజులు క్రితమే మొదలయిన SLBC టన్నెల్ పనుల్లో జరిగిన ప్రమాదాన్ని దాచిపెట్టడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు వారి ఆలోచనలకు అద్దం పడుతున్నాయన్నారు. ప్రమాదం పొద్దున 8:30 గంటలకు జరిగితే మధ్యాహ్నం వరకు ప్రభుత్వంలో చలనం లేకపోవడం అత్యంత దురదృష్టకరం. ఇప్పటి వరకు ఎంతమంది కార్మికులు చిక్కుకున్నారో కూడా తెలియని స్థితిలో యంత్రాంగం ఉంది. సీపేజ్ వచ్చింది, అందుకే కూలింది అని మంత్రి ఉత్తమ్ కుమార్ చెప్పడం హాస్యాస్పదం. సీపేజ్ వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎందుకు పాటించాలేదని ప్రశ్నించారు.

### కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారు..

అలాగే సుంకిశాల ప్రమాదంలా దాచిపెట్టే ప్రయత్నం చెయ్యకుండా ఇప్పటికైనా ఎంతమంది కార్మికులు లోపల ఇరుకున్నారో చెప్పాలన్నారు. వారిని రక్షించడానికి ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నారో వెంటనే చెప్పాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కమీషన్ల వేటలో పర్యవేక్షణను గాలికొదిలేయడం, నాణ్యతా ప్రమాణాల విషయంలో పూర్తిగా రాజీపడిపోవడం వల్లే ఇలాంటి వరుస సంఘటనలు జరుగుతున్నాయి. పైకప్పు కూలిన ఈ ఘటనలో లోపల ఎవరైనా చిక్కుకుని ఉంటే వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలన్నారు.

ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి వారి ప్రాణాలు కాపాడాలి. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తి పడకుండా నిబంధనల మేరకు పనులు జరిగేలా చూడాలి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఒక బ్యారేజీలో కేవలం పిల్లర్ కుంగితే నానా హంగామా చేసిన కాంగ్రెస్ నేతలు తమ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న ఈ వరుస వైఫల్యాలపై ఇప్పుడేమంటారు. సుంకిశాల ప్రమాదంలో కాంట్రాక్టర్ ను కాపాడేందుకు వాస్తవాలు దాచిపెట్టిన ప్రభుత్వం, కనీసం ఎస్ఎల్బీసీ సంఘటనపైనైనా పారదర్శకంగా దర్యాప్తు జరిపి ప్రమాదానికి గల కారణాలను బయటపెట్టాలన్నారు.

ఇక హరీష్ రావు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న ఎస్ఎల్బీసీ సొరంగం కూలిపోవడం కాంగ్రెస్ అసమర్థతకు, చేతగాని తనానికి నిదర్శనం అన్నారు. చేయక చేయక ఒక ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి ఆరంభంలోనే అంతం చేసిన ఘనత కాంగ్రెస్ పాలకులదే. మొన్న సుంకిశాలలో రీటైనింగ్ వాల్ కూలిన ఘటన, నేడు ఎస్ఎల్బీసీ సొరంగం కుప్ప కూలడం కాంగ్రెస్ కమిషన్ సర్కారు వైఫల్యానికి నిదర్శనం. ఈ ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే. గత నాలుగు రోజులుగా కొద్దికొద్దిగా మట్టి కూలుతున్నదనీ గుర్తించినప్పటికి ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదు.

ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడగా మరికొంత మంది కార్మికులు లోపల ఉన్నట్లు తెలుస్తుంది. వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి. ఈ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి వారి ప్రాణాలు కాపాడాలి. డీ వాటరింగ్ చేసి, వెంటనే విద్యుత్ పునరుద్ధరించి, శిథిలాలను తొలగించి కార్మికులను వెంటనే బయటకు తీసుకురావాలి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వెంటనే ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

# రేవంత్ జుట్టు చంద్రబాబు చేతిలో ఉంది: కవిత

మొదటి పేజీ తరువాయి

ఇదే సమయంలో పసుపు బోర్డు ఏర్పాటుపై కవిత స్పందిస్తూ..'పసుపు రైతుల పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోతోంది. పసుపు ధర రోజురోజుకూ పతనం అవుతోంది. 15వేల మద్దతు ధర ఇస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేశాయి. వ్యాపారులు సిండికేట్ అయి పసుపు రైతులను దగా చేస్తున్నారు. దీనిపై మార్చి ఒకటో తేదీ వరకు డెడ్‌లైన్ విధిస్తున్నాం. పసుపు క్వింటాలుకు పదిహేను వేల ధర ఇవ్వకుంటే రైతులతో కలిసి కలెక్టరేటును ముట్టడిస్తాం. పసుపు బోర్డు నామమాత్రంగా ఏర్పాటు చేశారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టి పాస్ చేయిస్తే రైతులకు న్యాయం జరుగుతుంది. పసుపు క్వింటాల్‌కు 12వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ నేతలు నిలబెట్టుకోవాలి. 12వేల కంటే ధర తక్కువగా వస్తే బోనస్ రూపంలో రైతులకు చెల్లించాలి' అని డిమాండ్ చేశారు.

# కేసీఆర్,కేటీఆర్,హరీశ్.. జనాభా లెక్కల్లోనే లేరు: సీఎం రేవంత్ రెడ్డి



కేసీఆర్ ,కేటీఆర్, హరీశ్ రావు జనాభా లెక్కల్లోనే లేరన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఇన్ని అవకాశాలు ఇచ్చిన.. వాళ్లు కులగణన సర్వేలో పాల్గొనలేదన్నారు. కులగణన సర్వే లెక్క తప్పైతే ఎట్ల తప్పో వచ్చి చూపించాలన్నారు రేవంత్. ప్రతిపక్షాలు మొండిగా..తొండిగా వాదిస్తున్నారని విమర్శించారు రేవంత్.కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే తప్పుల తడక అని అందుకు సర్వే వివరాలు బయటపెట్టలేదన్నారు. కేసీఆర్ చెప్పిన లెక్కల ప్రకారం బీసీలు తగ్గారు..ఓసీలు పెరిగారని చెప్పారు. కాకి లెక్కలు చెప్పి జనాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు రేవంత్. కులగణన సర్వే తెలంగాణ దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్ నిలుస్తోందన్నారు . దేశమంతా కులగణన చేయాల్సి వస్తుందని బీజేపీ భయపడుతోందన్నారు. కులగణన నూటికి నూరు శాతం పక్కా అని సీఎం రేవంత్ అన్నారు. కులగణన చరిత్రలో నిలిచిపోతుందన్నారు. బీసీ సంఘాలతో భేటీ అయిన రేవంత్ రెడ్డి.. కులగణనలో తెలంగాణ దేశంలోనే రోల్ మోడల్ గా నిలువబోతుందన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దన్నారు. సర్వే తప్పు అయితే..ఎట్ల తప్పో చూపించాలని బీజేపీ,బీఆర్ఎస్ కు సవాల్ విసిరారు రేవంత్. కుట్రలో భాగంగానే బీజేపీ,బీఆర్ఎస్ కులగణన సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు రేవంత్. కులగణన లెక్కలు తప్పు కాదని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కులాల వారీగా సమావేశాలు నిర్వహించి కులగణన లెక్క పక్కా అని మార్చి 10 లోగా తీర్మానం చేయాలని సూచించారు రేవంత్ .

# మీరిద్దరే KR బ్రదర్స్.. సవాల్ చేస్తే అవన్నీ బయటపెడతా..: కేంద్రమంత్రి బండి

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వానికి లోపాయికారీగా సపోర్ట్ చేస్తున్నది బీఆర్ఎస్ పార్టీనేనని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేసు స్కాంలో కచ్చితమైన ఆధారాలున్నా అందుకే అరెస్టు చేయటం లేదన్నారు. 'నిజమైన KR బ్రదర్స్ (కేటీఆర్, రేవంత్ రెడ్డి) మీరే. నీ దొంగ నాటకాలు బంద్ చేయ్. ఇంకా నీ అహంకారం పోలే. పర్సనల్‌గా పోవద్దని నేను ఆగుతున్నా. సవాల్ చేస్తే అవన్నీ బయటపెడతా. నాపై లీగల్ నోటీసు ఇచ్చి పారిపోయిన పిరికిపందవు నువ్వు. నేను సామాన్య కార్యకర్తను. కింది స్థాయి నుండి ఉద్యమాలు చేసి లాఠీదెబ్బలు తిని జైళ్లకు పోయి ఈ స్థాయికి వచ్చిన సామాన్య కార్యకర్తను. నువ్వు అవినీతి పరుడివే. రేవంత్ రెడ్డి అవినీతి పరులే. కాంగ్రెస్‌పై కొట్లాడేది బీజేపీయే. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ పార్టీకి పోటీ చేయడానికి అభ్యర్థులే కరువయ్యారు. మీరు చేసిన అవినీతికి అరెస్ట్ కాకుండా ఉండేందుకు కేసీఆర్ ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల వద్దకు పోయి డబ్బులు ఇచ్చి వస్తున్నడు. కాంగ్రెస్ పార్టీకి మీ పార్టీ ఏటీఎంలా మారింది. నువ్వు ఇంకోసారి మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదు. పైసలిచ్చి బీరు, బిర్యానీలతో సభలు పెట్టి పార్టీ నడిపే చరిత్ర బీజేపీది కాదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నాం. డేట్, టైం, వేదిక ఫిక్స్ చేయమని కోరుతున్నా. మా పార్టీ అధ్యక్షులు ఎవరి పేరును ప్రతిపాదిస్తే... వారు సీఎంతో చర్చకు సిద్ధం. 14 నెలల రేవంత్ రెడ్డి పాలనపై.. 10 ఏళ్ల కేసీఆర్ పాలనపై, మోదీ పాలనపై ఎవరేం చేశారో ? గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల వారీగా లెక్కలతో వివరించేందుకు సిద్ధంగా ఉన్నాం. అంతేకాదు 6 గ్యారంటీలతో కాంగ్రెస్ చేసిన మోసాలను, అవినీతి, అక్రమాలను, 15 శాతం కమీషన్ వివరాలపైనా బహిరంగ చర్చకు సిద్ధం. సీఎంకు దమ్ముంటే చర్చ జరపాలి.' అని బండి సంజయ్ సవాల్ విసిరారు.

## మోదీ తలకిందులుగా తపస్సు చేసినా.. రాహుల్ గాంధీ వంద జోడో యాత్రలు చేసినా.. ఈ అభివృద్ధిని సాధించలేరు : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ నాయకత్వంలో సొంత ఆదాయ వనరులతో కేంద్రం మీద ఆధారపడకుండా, ఇతరుల ముందు చేయి చాపకుండా తెలంగాణ రాష్ట్రం అగ్రభాగాన నంబర్ వన్‌గా నిలబడిందని ఆర్బీఐ నివేదిక తెలిపింది. 84 శాతంతో ఎస్ఓటీఆర్‌లో ముందు ఉన్నాం అని కేటీఆర్ తెలిపారు.

కాళేశ్వరం అంటేనే కమిషన్ల ప్రాజెక్టు అని ఎన్నికలకు ముందు కొందరు చిల్లర వాగుడు వాగారు. వారికి కూడా ఇదే నివేదిక(తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్) సమాధానం చెప్పింది. నివేదికలో ఏం చెప్పారంటే.. కాళేశ్వరం, మిషన్ కాకతీయ, రైతుబంధు, 24 గంటల కరెంట్ వల్ల సంపద పెరిగిందని నివేదికలో పేర్కొన్నారు. వ్యవసాయానికి సంబంధించి కాళేశ్వరం, మిషన్ కాకతీయ ద్వారా వ్యవసాయ విస్తీర్ణం పెరిగిందని పేర్కొన్నారు. 2014లో 34 లక్షల ఎకరాల్లో వరి పంటలు పండేవి.. 68 లక్షల టన్నుల వరి ఉత్పత్తి అయ్యేది. మేం దిగిపోయే నాడు ఒక కోటి 18 లక్షల ఎకరాల్లో సాగు అయింది. 2 కోట్ల 60 లక్షల టన్నులు ఉత్పత్తి జరిగింది అని కేటీఆర్ తెలిపారు.

ఐటీ ఎగుమతుల్లో 2014లో 57 వేల కోట్లు ఉంటే 2023లో 2 లక్షల 41 వేల కోట్లు. నాడు ఐటీ ఉద్యోగుల సంఖ్య 3 లక్షల 23 వేలు.. మేం దిగిపోయేనాడు 10 లక్షల ఉద్యోగాలు. ఇలా వ్యవసాయం, ఐటీ పెరిగింది. యాదవ కురమ సోదరులకు గొర్రెలు పంపిణీ చేసి బలోపేతం చేసే ప్రయత్నం చేస్తే మీరు చిల్లరగా మాట్లాడారు. కానీ జీవ సంపదలో నంబర్ వన్‌లో ఉన్నారని మీ నివేదికలో పేర్కొన్నారని కేటీఆర్ గుర్తు చేశారు.

విద్యుత్ స్థాపిత సామర్థ్యం పెరిగిందని కూడా నివేదికలో పేర్కొన్నారు. ఆనాడు 1356 యూనిట్లు ఉంటే.. నేడు 2349 యూనిట్లు పెరిగింది. ఇవన్నీ కూడా మీ నివేదికనే చెబుతుంది. పారిశ్రామిక విస్తరణ కూడా పెరిగిందని చెప్పారు. కాళేశ్వరం, మిషన్ కాకతీయ వల్ల లాభం జరిగిందని చెబుతుంది మీ నివేదిక.. మీరు తప్పక చదవండి. మోదీ తలకిందులు తప్పసు చేసినా.. రాహుల్ గాంధీ మరో వంద జోడో యాత్రలు చేసినా ఈ అభివృద్ధి సాధించలేరు అనేది వాస్తవం. తెలంగాణలో గత పదేండ్లలో కేసీఆర్ అకుంఠిత దీక్షతో, మొక్కవోని పట్టుదలతో ఒక అభివృద్ధి యజ్ఞం చేశారు.. ఇది వాస్తవమని మీ నివేదికనే చెబుతుంది. 2014–15లో 5 లక్షల కోట్లు ఉన్న సంపద ఇవాళ 15 లక్షల కోట్లు అయిందని నివేదిక చెబుతుంది ఇది వాస్తవం. ఇలా అన్ని రంగాల్లో తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి సాధించిందని కేటీఆర్ స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి అనేటోడు ఇన్ని పచ్చి అబద్ధాలు చెప్తాడని ఎవరు అనుకోరు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కానీ సీఎం రేవంత్ చెప్పి పచ్చి అబద్దాలను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఎండగట్టి ఉతికి ఆరేశారని కేటీఆర్ తెలిపారు.

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నట్టు మీరు విడుదల చేసిన నివేదికనే చెబుతుంది. మరి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ ఏదాడిలో నువ్వు ఏం చేశావంటే.. రేవంత్‌కు చెప్పేందుకు మ్యాటర్ లేదు. మేం(బీఆర్ఎస్) దిగిపోయేనాడు ఉన్న రేషన్ కార్డుల సంఖ్య 89 లక్షల 97 వేలు అని భట్టి విక్రమార్కనే చెప్పిండు. మరి కొత్తగా ఏమన్న ఇచ్చారంటే.. లక్ష కార్డులు తొలగించామని చెప్పారు. కొత్తవి ఇవ్వకుండా ఉన్నవి కట్ చేసింర్రు అని కేటీఆర్ తెలిపారు.

ముఖ్యమంత్రి అనేటోడు ఇన్ని పచ్చి అబద్ధాలు చెప్తడు అని అనుకోరు. సీఎం చెప్పిన పచ్చి అబద్దాలను డిప్యూటీ సీఎం ఎండగట్టి ఉతికి ఆరేశారు. అప్పులకు మిత్తీలకు నెలకు రూ. 6500 కోట్లు కడుతున్నాం అని రేవంత్ రెడ్డి చెప్పిండు. నేను చెప్పింది తప్పయితే ఏ శిక్షకైనా సిద్ధం. మిత్తీలకు పోయిన పది నెలలకు 22 వేల 56 కోట్లు కట్టినట్లు నివేదికలో పేర్కొన్నారు. నెలవారీ లెక్క కూడా ఇందులో ఇచ్చారు.. నెలకు పోయిన ఏప్రిల్ నుంచి మొన్న జనవరి వరకు 22 వేల 56 కోట్లు. అంటే నెలకు 2200 కోట్లు అని భట్టి విక్రమార్క చెబుతుండు. మరి నెలకు 6500 కోట్లు కడుతున్నాని బోగస్ ముఖ్యమంత్రి చెబుతుండు. 4300 కోట్లు ఎక్కడ పోతున్నాయి. టకీటకీమని రైతుబంధు పడుతలేదు. తులం బంగారం వస్తలేదు.. టకీటకీమని రాహుల్ గాంధీ ఖాతాలో పడుతున్నాయో చూడాలి అని కేటీఆర్ పేర్కొన్నారు.

మిత్తీలు మాకు అప్పజెప్పినప్పుడు.. 2014లో రాష్ట్ర ఆదాయంలో 21.64 శాతం. 2023లో కేవలం 17.19 శాతం మాత్రమే. ఈ విషయం ఎందుకు చెప్పడం లేదు. రాష్ట్రాన్ని అద్భుతంగా అప్పజెప్పితే.. మీరు ఆగం చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక లోటు గరిష్టానికి పడిపోయిందని ఇవాళ వార్తలు. దివాళకోరు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే.. వీరి అసమర్థ పాలనలో తెలంగాణ చేతికి చిప్ప వచ్చే పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే జనవరి నెలఖారు వరకు రెవెన్యూ ఆదాయం ఒక లక్ష 23 వేల 815 కోట్లు సంపాదించుంర్రు.. కానీ ఖర్చు పెట్టింది.. ఒక లక్షా 49 వేల 866 కోట్లు. అంటే రాబడి కంటే ఖర్చు ఎక్కువ ఉంది. కొత్త స్కీం ప్రారంభించలేదు. రైతుబంధు లేదు, రుణమాఫీ లేదు, స్కూటీలు, తులం బంగారం లేవు, పెన్షన్లు లేవు.. మరి ఎందుకు ఖర్చు పెరిగింది.. ఎందుకు అప్పు చేస్తున్నారో చెప్పగలరా..? మీకు మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని అప్పజెప్పితే నువ్వు ఒక ఏడాదిలో ఒక లక్షా 41 వేల కోట్లు అప్పు జేశావు. రేవంత్ తుగ్లక్ నిర్ణయాల వల్ల హైడ్రాతో రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతిన్నది. రిజిస్ట్రేషన్లు తగ్గాయి. రియల్ ఎస్టేట్ రంగానికి పొడిచిన వెన్నుపోటు కారణంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రేవంత్ రెడ్డికి రాజకీయ కక్షలు తెలుసు తప్ప రాష్ట్రాన్ని ఆర్థికంగా బాగు చేయాలనే సోయి లేదు. వ్యవసాయాన్ని చావుదెబ్బ కొట్టావు. వ్యవసాయం సంక్షోభంలో పడింది. పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంది. కేసీఆర్ మీద కోపంతో మేడిగడ్డ రిపేర్ చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి దాపురించిందని కేటీఆర్ మండిపడ్డారు

## తెలంగాణలో కొలువుల జాతర..
### భారీ నోటిఫికేషన్లకు గ్రీన్‌సిగ్నల్

ఇందుకు సంబంధించిన ఫైల్ పై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈ రోజు సంతకం చేశారు. దీంతో 6399 అంగన్వాడీ టీచర్లు, 7837 హెల్పర్ల పోస్టులు.. అంటే మొత్తంగా 14,236 ఉద్యోగాల భర్తీకి రంగం సిద్ధమైంది. ఎన్నికల కోడ్ ముగియగానే ఇందుకు సంబంధించిన నోఫికేషన్లు జారీ కానున్నాయి.

అయితే.. నోటిఫికేషన్లను జిల్లాల వారీగా కలెక్టర్లు జారీ చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇంత పెద్ద మొత్తంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఉద్యోగాలను భర్తీ చేయడం ఇదే తొలిసారి అని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఖాళీలను భర్తీ చేస్తే అంగన్వాడీ కేంద్రాలు మరింత పటిష్టంగా మహిళలు, చిన్నారులకు సేవలు అందిస్తాయన్న అభిప్రాయాన్ని ప్రభుత్వ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

### రాష్ట్రంలో మొత్తం 35 వేల అంగన్వాడీ కేంద్రాలు..

తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 140 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 35,700 అంగన్వాడీ కేంద్రాలు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మొత్తం 35,700 అంగన్వాడీ కేంద్రాల్లో 31,711 ప్రధాన అంగన్వాడీ కేంద్రాలు కాగా.. మిగతా 3,989 మినీ అంగన్వాడీ కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. ప్రతీ అంగన్వాడీ కేంద్రంలో ఒక టీచర్ తో పాటు ఒక హెల్పర్ ఉంటారు. మినీ అంగన్వాడీ కేంద్రంలో మాత్రం ఒక టీచర్ మాత్రమే ఉంటారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తిస్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేసింది. దీంతో అక్కడ హెల్పర్ పోస్టులను మంజూరు చేశారు

## సీఎం రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తున్నా: కిషన్‌రెడ్డి



ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలు గెలుస్తామని.. సీఎం రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తున్నానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హామీలు అమలుకు ప్రణాళిక, కార్యాచరణ ప్రకటిస్తే చర్చకు సిద్ధమన్నారు. ఏ ఒక్క హామీకి కనీసం కార్యచరణ కూడా లేదు. చర్చకు రమ్మనడం హాస్యాస్పదం. దేనికి చర్చకు రావాలో సీఎం రేవంత్ స్పష్టం చేయాలని కిషన్‌రెడ్డి అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలోచించి ఓటేయాలి. బీజేపీని ఆదరించాలి. బీఆర్ఎస్ పాలనలో శాసన మండలి ప్రాధాన్యత తగ్గింది. ఎన్నికల్లో పసుపు బోర్డు ప్రభావం ఉంటుంది. కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదు. రిజర్వేషన్‌లను స్వాగతిస్తాం. ముస్లింలను బీసీ జాబితాలో చేరిస్తే వ్యతిరేకిస్తాం. బీజేపీ తో బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధాలు లేవు. కాంగ్రెస్‌తో కలిసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. గతంలో అనేక సార్లు బీఆర్ఎస్ కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చింది. జిల్లా అధ్యక్షుల నియామకాల ప్రక్రియ తర్వాతే రాష్ట్ర అధ్యక్షుని ఎంపిక" ఉంటుందని కిషన్‌రెడ్డి తెలిపారు.

14 నెలల్లో కాంగ్రెస్ ప్రజలకు ఓరగబెట్టింది ఏమీ లేదు. అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు శాసన మండలి ప్రాధాన్యతను తగ్గించాయి. ప్రజా సమస్యల పోరాటానికి శాసన మండలి వేదిక. కుల గణనకు బీజేపీ వ్యతిరేకం కాదు. ముస్లింలను బీసీ లో చేర్చే కుట్ర జరుగుతుంది. దానికి వ్యతిరేకం" అని కిషన్‌రెడ్డి చెప్పారు.

## ఘనంగా శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు



మోత్కూర్ 22 ఫిబ్రవరి( క్రాంతి న్యూస్)మోత్కూరు మండలంలోని పాలడుగు గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. దేవదయ అధ్యక్షులు బండ యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణలు, విశేష అలంకరణలు, మంగళ వాద్యాల నడుమ..భక్తి పారవశ్యంతో అర్చకులు శాస్త్రోక్తంగా వేడుకలు జరిపారు. కళ్యాణం లో. గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ మరిపెల్లి యాదయ్య దంపతులు, గుండు కృష్ణమూర్తి దంపతులు, పులగం వెంకట్రెడ్డి దంపతులు, గ్రామ పెద్దలు సింగిరెడ్డి నరసింహారెడ్డి, అంతటి నరసింహ, యాస నర్సిరెడ్డి, గుదే మధుసూదన్ యాదవ్, ఎడ్ల భగవంతు, పబ్బు హనుమయ్య, బరిగెల నారాయణ, ఆల్ల సోమప్ప , కొంపెల్లి అంజయ్య, మరిపెల్లి చంద్రయ్య, బొడిగె వీరయ్య, బరిగెల సూర్యనారాయణ తదితరులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

## జగన్నాధపురం పాఠశాలలో కవలల దినోత్సవం

పాల్వంచ మండలం,22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ప్రపంచ కవలల దినోత్సవం సందర్భంగా పాల్వంచ మండలంలోని జగన్నాధపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం కళల కవలల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు పాఠశాల హెడ్ మాస్టర్ చెల్లూరి రమాదేవి కూడా కవలగా జన్మించడంతో ఆ పాఠశాలలోని ముగ్గురు కవల పిల్లలతో కలిసి కవలల దినోత్సవం జరుపుకున్నారు. పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న జాటోత్ ప్రవళిక, ప్రణీత, 3వ తరగతి చదువుతున్న కందుకూరి రుష్మంత్ , రేవంత్, మాలోత్ చరణ్, చరణ్ రాజ్, లతో కలిసి హెడ్మాస్టర్ రమాదేవి కేకులు కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు, చాక్లెట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భానోత్ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సుజాత విద్యార్థుల తల్లిదండ్రులు శిరీష, నజీమా , మహాలక్ష్మి, వెంకటమ్మ , మణికుమారి తదితరులు పాల్గొన్నారు..



## బాల్యం పిల్లల హక్కు – బాలలు జాతి సంపద




మర్పల్లి, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):మర్పల్లి : ఈ రోజు మర్పల్లి మండల కేంద్రంలో ని గిరిజన ఆశ్రమ పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆద్వర్యంలో బాల్యం పిల్లల హక్కు – బాలలు జాతి సంపద కార్యక్రమాన్ని నిర్వహించారు.పాఠశాల విద్యార్థులకు బాలల హక్కులపై చిత్రలేఖనం పొట్టీలు నిర్వచించారు ఇ పోటిలో 40 మంది విద్యార్థులు 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులు పాల్గొనగా ఈ కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్గా మండల ఐసీడీఎస్ సూపర్వైజర్ రిజ్వానా మేడం మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింగ్ రావు గార్లు ముగ్గురిని ఎంపిక చేశారు మొదటి బహుమతి ఏస్ కార్తీక్,రెండవ బహుమతి ఆర్. రామ్ చరణ్,మూడవ బహుమతి,సిచ్.గౌతంల కు వికారాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమహారతి మేడం చేతులమీదుగా బహుమతులు అందజేశారు, చైల్డ్ రైట్స్ గూర్చి విద్యార్థులకు వివరించారు. ఇ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింగ్ రావు,ఐసీడీఎస్ సుప్రవేజర్ రిజ్వన బేగం,ఏఎన్ఎం శారదా,పాఠశాల ఉపధ్యాయులు వసంత్,కుమార్,అనురాధ విద్యార్థులు పాల్గొన్నారు

## ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి
### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




భద్రాద్రి కొత్తగూడెం, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సిబ్బందికి సూచించారు. శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో ఫిబ్రవరి 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పిఒ, ఏపీఓలకు రెండో విడత శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల్లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందికి పోలింగ్ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికల ముందు రోజే సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకొని అక్కడ తమకి కేటాయించిన పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఓటర్ల జాబితా, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఎలక్షన్ సామాగ్రి అన్ని పరిశీలించుకోవాలని అన్నారు. ఫిబ్రవరి 26వ తేదీన ఉదయం కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఉంటుందని, ఆరోజు అందరూ విధిగా సమయపాలన పాటించి మీకు సంబంధించినటువంటి పోలింగ్ సామాగ్రిని తీసుకొని కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లవలసిందిగా ఆదేశించారు. ఫిబ్రవరి 27 ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ఉంటుందని ఆయన తెలిపారు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని తెలియజేయడం, క్రాస్ చెక్ చేసుకోవటం, నాలుగు గంటలకు ఆఖరి ఓటర్ ఓటు వేసిన తర్వాత బాక్సులు అన్నీ సీల్ చేసి నేరుగా నల్గొండ కలెక్టరేట్ కు అందజేయాలని తెలిపారు. పోలింగ్ అధికారులు అందరూ బాధ్యతగా ఎన్నికల విధులను ప్రశాంతమైన వాతావరణంలో రహస్య ఓటింగ్ పద్ధతిలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికలను నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపర్డెంట్ లు దార ప్రసాద్, రంగ ప్రసాద్, జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనీ పూసపాటి సాయి కృష్ణ, కిరణ్ కుమార్, అశోక్ మరియు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సి టాలెంట్ టెస్ట్ విజయవంతం
### ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ

కాటారం, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం భారత విద్యార్థి సమైక్య ఎస్ఎఫ్ఐ నిర్వహించిన పదవ. తరగతి టాలెంట్ టెస్ట్ విజయవంతంగా ముగిసాయి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని పరీక్షలో భాగస్వామ్యులు అయినారు మొదటిసారి బోర్డ్ ఎగ్జాం రాయబోతున్న విద్యార్థులకు మంచి అవగాహన వస్తుందని ముందుగానే టాలెంట్ టెస్ట్ వల్ల పిల్లలు ఎగ్జామ్ రాయడానికి ఎంతో దోహద పడతాయని చాలా నేర్చుకున్నామని వారన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ కార్యదర్శి శ్రావణ్ మరియు కాటారం మండల కమిటీ అధ్యక్షుడు టీ సాగర్ కాటారం మండల కార్యదర్శి రచన తదితరులు పాల్గొన్నారు



## గురుకుల, నవోదయ సీట్లు అత్యధికంగా సాధిస్తున్న ఏకైక విద్యాసంస్థ సాయి ఎక్సలెంట్

భద్రాద్రి కొత్తగూడెం , 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):సాయి ఎక్సెలెంట్ స్కూల్ గురుకులం 4 వ తరగతి చదువుతూ 5వ తరగతిలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులకు శుభాభినందనలు తెలియజేస్తూ పరీక్షా సామాగ్రినీ అందజేసిన మాజీ సర్పంచి కట్రా మోహన్ రావు జూలూరుపాడు మండలం, పాపుకొల్లు రోడ్డు



సాయి ఎక్సెలెంట్ విద్యాలయంలో నాలుగవ తరగతి గురుకులం చదువుతున్న విద్యార్థులకు పడమటి నర్సాపురం సర్పంచ్ కట్రా మోహన్ రావు విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పెన్నులు, స్కేలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలూరుపాడు మండలంలో ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన కోచింగ్ ఇస్తూ గురుకుల, నవోదయ సీట్లు అత్యధికంగా సాధిస్తున్న ఏకైక విద్యాసంస్థ సాయి ఎక్సలెంట్ స్కూల్ ని అభినందించారు. నేటి బాలలే రేపటి పౌరులుగా ఈ సమాజం అభివృద్ధి చెందాలంటే కేవలం విద్యతోనే జరుగునని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా కరెస్పాండెంట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరము నవోదయ సైనిక మరియు ఏకవలవ్య మోడల్ స్కూల్ కు అదేవిధంగా గురుకులాలకు వందల సీట్లు సాధించడమే ధ్యేయంగా పిల్లలకు బంగారు భవిష్యత్తుని అందించడమే తన లక్ష్యంగా మార్చుకుంటూ వాళ్లకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని అనుక్షణం ప్రయాస పడుతూ వాళ్లకు బంగారు భవిష్యత్తును అందించడమే ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజారావుపేట గ్రామ పెద్దలు వెంకటనారాయణ రావు ఉపాధ్యాయులు భద్రం నబీనా, ప్రశాంతి, నవ్య మరియు గురుకుల విద్యార్థులు పాల్గొన్నారు.

# పరిటాల శ్రీరామ్‌కు జేసీ ప్రభాకర్ రెడ్డి సన్మానం..

## అనంత రాజకీయాల్లో ఆసక్తికర ఘటన..



ఉమ్మడి అనంతపురం జిల్లా రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత పరిటాల సునీత తనయుడు పరిటాల శ్రీరామ్‌ను, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సన్మానించారు. రాప్తాడు అగ్రికల్చర్ సదస్సు ఇందుకు వేదికైంది. పరిటాల శ్రీరామ్‌ను సన్మానించిన జేసీ ప్రభాకర్ రెడ్డి.. వ్యవసాయ సదస్సుకు చేసిన ఏర్పాట్లను సైతం మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా జేసీ ప్రభాకర్ రెడ్డి, పరిటాల శ్రీరామ్ మధ్య కాసేపు సరదా సంభాషణ జరిగింది. వ్యవసాయంలో మెలుకువలు నేర్పించేందుకు రాప్తాడులో రైతుబడి అగ్రిషో నిర్వహిస్తున్నారు.

జేసీ కుటుంబం, పరిటాల ఫ్యామిలీల మధ్య విబేధాలు ఉన్నాయంటూ ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. 2004కు ముందు అనంతపురం రాజకీయాలకు సంబంధించి మాజీ మంత్రి పరిటాల రవీంద్ర తెలుగుదేశం పార్టీలో ముఖ్య నేతగా ఉంటే.. కాంగ్రెస్ పార్టీలో జేసీ దివాకర్ రెడ్డి కీలక నేతగా కొనసాగుతూ ఉండేవారు. వేర్వేరు పార్టీలలో ఉండటంతో అప్పట్లో రాజకీయ విభేదాలు ఉండేవని ప్రచారంలో ఉండేది. పరిటాల రవి హత్య తర్వాత ఆయన సతీమణి సునీత రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 2014లో జరిగిన రాష్ట్ర విభజనతో తెలుగు రాజకీయాల్లో ఆసక్తికర ఘటనలు చోటుచేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ కరడుగట్టిన నేతగా పేరొందిన జేసీ దివాకర్ రెడ్డి.. టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

అయితే జేసీ దివాకర్ రెడ్డి చేరికను, పరిటాల సునీత వ్యతిరేకించారనే వార్తలు కూడా అప్పట్లో వచ్చాయి. అధినేత చంద్రబాబు నాయుడు జోక్యంతో జేసీ ఫ్యామిలీ టీడీపీలో చేరిపోయింది. అప్పటి నుంచి జేసీ కుటుంబం టీడీపీలోనే కొనసాగుతూ వస్తోంది. జేసీ ఫ్యామిలీ నుంచి దివాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తనయులు ఇద్దరూ కూడా ఎన్నికల్లో పోటీ చేశారు. 2024లో జరిగిన ఎన్నికల్లో తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జేసీ ప్రభాకర్ రెడ్డి తనయుడు అస్మిత్ రెడ్డి టీడీపీ తరుపున పోటీచేసి విజయం సాధించారు.

అటు పరిటాల రవి తనయుడు పరిటాల శ్రీరామ్ ధర్మవరం నియోజకవర్గం నుంచి పోటీచేయాలని భావించినా.. అవకాశం దక్కలేదు. పొత్తుల లెక్కల్లో ఈ స్థానం బీజేపీకి దక్కగా.. కమలం పార్టీ నుంచి సత్యకుమార్ యాదవ్ పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం మంత్రి పదవి దక్కించుకున్నారు. సత్యకుమార్ యాదవ్ విజయానికి పరిటాల శ్రీరామ్ తన సహకారం అందించారు. ప్రస్తుతం పరిటాల శ్రీరామ్ ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇంఛార్జిగా కొనసాగుతున్నారు. అయితే జేసీ, పరిటాల ఫ్యామిలీలు రెండూ టీడీపీలో ఉన్నప్పటికీ విభేదాలు ఉన్నాయనే వార్తలు నడుస్తూ వచ్చాయి. తాజాగా ఇద్దరు నేతలు.. ఇలా ఒక్కచోట చేరటంతో టీడీపీ శ్రేణులు సంబరపడుతున్నాయి.

# ఏపీ అసెంబ్లీ సమావేశాలకు వైఎస్ జగన్..!

## వైసీపీ అధినేత కీలక నిర్ణయం..



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు రంగం సిద్ధమైంది. సోమవారం (ఫిబ్రవరి 24) నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఫిబ్రవరి 24వ తేదీ ఉదయం 10 గంటలకు శాసనసభ, శాసనమండలిని ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం ఉంటుంది. ఆ తర్వాత బీఏసీ సమావేశం నిర్వహిస్తారు. బీఏసీ సమావేశంలో అసెంబ్లీ సమావేశాలను ఎన్ని రోజులు పాటు నిర్వహించాలనే దానిపై చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటారు. 24వ తేదీ గవర్నర్ ప్రసంగం, 25న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం ఉంటుంది. ఆ తర్వాత రెండు రోజులు సెలవులు ఉండే అవకాశాలు ఉన్నాయి.

ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రి పండుగ వచ్చింది. అలాగే ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆ రెండు రోజులు ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించకపోవచ్చని తెలుస్తోంది. ఫిబ్రవరి 28వ తేదీన ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అందులో భాగంగా ఫిబ్రవరి 28 ఉదయం 9 గంటలకు ఏపీ కేబినెట్ సమావేశం కానుంది. ఈ సమావేశంలో ఏపీ బడ్జెట్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. అదే రోజు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఏపీ అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. మరోవైపు అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆదివారం.. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించన్నున్నారు.

తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లపై డీజీపీ, ఇతర అధికారులతో సమీక్షించనున్నారు.

అసెంబ్లీ సమావేశాలకు వైఎస్ జగన్!

మరోవైపు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరుకావాలని వైఎస్ జగన్ నిర్ణయించినట్లు సమాచారం. అధినేత నిర్ణయానికి అనుగుణంగా వైఎస్ జగన్‌తో పాటుగా వైసీపీ ఎమ్మెల్యేలు కూడా సోమవారం అసెంబ్లీకి హాజరుకానున్నట్లు తెలిసింది. సోమవారం ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం ఉండనుంది. గవర్నర్ ప్రసంగానికి వైఎస్ జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు సమాచారం.

# మిర్చి రైతులకు బిగ్ రిలీఫ్..

## పంట కొనుగోలుకు కేంద్రం నిర్ణయం.. క్వింటాల్ ఎంతంటే?

ఏపీలోని మిర్చి రైతులకు కేంద్రం శుభవార్త వినిపించింది. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద మిర్చి పంట కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పెమ్మసాని చంద్రశేఖర్ ట్వీట్ చేశారు. ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా గుంటూరు మిరప రైతులకు పెద్ద ఉపశమనం! భారత ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద క్వింటాలుకు రూ. 11,781 మద్దతు ధరతో మిర్చి సేకరణకు ఆమోదం తెలిపిందిఅంటూ పెమ్మసాని చంద్రశేఖర్ ట్వీట్ చేశారు. మిర్చి ధరలు తగ్గుతున్న నేపథ్యంలో ధరల స్థిరీకరణకు ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి ట్వీట్ చేశారు

ఈ నిర్ణయం మేరకు తొలుత 25 శాతం ఉత్పత్తులను కొనుగోలు చేయనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఆ తర్వాత అవసరమైన మేరకు మిర్చి సేకరణను పెంచనున్నట్లు వివరించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కృషి చేసినందుకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయం రైతులకు చాలా ఉపయోగపడుతుందని పెమ్మసాని చంద్రశేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

### మిర్చి రైతుల సమస్యలపై సీఎం చంద్రబాబు సమీక్ష

మరోవైపు మిర్చి రైతుల సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మిర్చి ధరల గురించి రైతులు, ఎగుమతిదారులతో చంద్రబాబు చర్చించారు. ఇతర దేశాలకు మిర్చి ఎగుమతులు పెరుగుతున్న నేపథ్యంలో.. మిర్చి పంటకు సరైన ధర దక్కడానికి ఉన్న మార్గాలను అన్వేషించాలని చంద్రబాబు ఆదేశించారు.



అలాగే గుంటూరు మార్కెట్ యార్డ్‌లో ఉన్న మిర్చి నిల్వల గురించి కూడా చంద్రబాబు నాయుడు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మిర్చి ధరల తగ్గుదల నేపథ్యంలో గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్రం మిర్చి పంటను కొనుగోలు చేయాలని చంద్రబాబు లేఖ కూడా రాశారు.

# టెస్లా కోసం ఏపీ ఆపరేషన్ ఆకర్ష్..

## అప్పటి నుంచే మొదలు..!




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే. అమెరికా పర్యటనలో భాగంగా ఎలాన్ మస్క్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఇక అప్పటి నుంచి భారతదేశంలో టెస్లా కార్ల ప్లాంట్ గురించి చర్చ మొదలైంది. ఈ క్రమంలోనే ఈ రేసులోకి ఇప్పుడు ఏపీ వచ్చి చేరింది. టెస్లా ప్లాంట్ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల సంస్థ అయిన టెస్లా మనదేశంలోకి వచ్చేందుకు ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తోంది. అయితే వివిధ కారణాలతో ఆ అడుగులు ముందుకు పడలేదు. అయితే టెస్లా ప్లాంట్ కోసం అనేక రాష్ట్రాలు ప్రయత్నిస్తున్నాయి. మహారాష్ట్ర, గుజరాత్ ప్రభుత్వాలు టెస్లా ప్లాంట్‌ను తమ రాష్ట్రానికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా.. తాజాగా ఈ రేసులోకి ఆంధ్రప్రదేశ్ కూడా చేరినట్లు తెలిసింది.

టెస్లా ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ప్లాంట్ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గట్టిగా కృషిచేస్తున్నట్లు ఎకనమిక్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి బోర్డు (%జుణదీ%) ఆంధ్రప్రదేశ్‌ను టెస్లాకు అనువైన గమ్యస్థానంగా మార్చుతున్నట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న పోర్టుల అనుసంధానం, భూమి లభ్యత.. టెస్లా ప్లాంట్ ఏర్పాటుకు ఉపయోగపడతాయని ఏపీ ప్రభుత్వం తెలియజేసినట్లు సమాచారం. మరోవైపు 2024 అక్టోబర్‌లోనే టెస్లా కంపెనీతో ఏపీ ప్రభుత్వం చర్చలు ప్రారంభించింది. అప్పట్లో అమెరికాలో పర్యటించిన మంత్రి నారా లోకేష్ టెస్లా సీఎఫ్‌వో వైభవ్ తనేజాతో భేటీ అయ్యారు. ఈ విషయంపై చర్చించారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎలాన్ మస్క్ భేటీతో ప్లాంట్ ఏర్పాటు అంశం మరోసారి తెరపైకి వచ్చింది.

మరోవైపు టెస్లా కంపెనీని ఆకర్షించేందుకు ఏపీ ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు ఆఫర్ చేసినట్లు తెలిసింది. అవసరమైన భూమిని సైతం అందించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అయితే టెస్లా కంపెనీ తొలుత కార్ల దిగుమతిపైనే ఫోకస్ పెట్టినట్లు సమాచారం. ఆ తర్వాతే పూర్తి స్థాయి తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. మరి ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ ఏ మేరకు వర్కవుట్ అవుతుంది.. టెస్లా కంపెనీ ఏపీకి వస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఏపీలో ఇప్పటికే కియా కార్ల పరిశ్రమ ఏర్పాటైన సంగతి తెలిసిందే. అనంతపురం జిల్లాలో కియా కార్ల ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఈ ప్లాంట్ నుంచి ఇప్పటికే కార్ల ఉత్పత్తి, అమ్మకాలు కూడా జరుగుతున్నాయి.

# గంజాయి రహిత రాష్ట్రంగా ఏపీని మారుస్తాం

గంజాయి రహిత రాష్ట్రంగా ఏపీని మారుస్తామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. ఏపీ ప్రభుత్వం గంజాయి రవాణాపై దృష్టి పెట్టిందని అన్నారు. కృష్ణా జిల్లాలోని 4 సబ్ డివిజన్లలో శనివారం గంజాయిని సీజ్ చేశారు. కోటి 87లక్షల 25 వేల విలువ కలిగిన గంజాయిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడారు. డ్రగ్స్ నివారణపై కొత్తగా ఈగల్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంటర్ స్టేట్ గ్యాంగ్‌లపై నిఘా పెట్టామని అన్నారు. ఒడిస్సా రాష్ట్రం నుంచి గంజాయి రవాణా అవుతుందని తెలిపారు. ఏపీలో గంజాయి సాగు పూర్తిగా నియంత్రణలోకి వచ్చిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా చెప్పారు.

ఏపీ నుంచి గంజాయి రవాణా జరుగుతుందని తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్న అంతర్ రాష్ట్ర ముఠాలను పట్టుకుంటున్నామని అన్నారు. గంజాయి రవాణా



చేస్తున్న వాళ్ల ఆస్తులు సీజ్ చేస్తున్నామని చెప్పారు. డ్రగ్స్, గంజాయి రవాణా చేసే వాళ్లను ఈ సందర్భంగా హెచ్చరించారు. కాలేజ్‌ల వద్ద గంజాయి విక్రయిస్తున్న వారిని అరెస్టు చేస్తున్నామని అన్నారు. గంజాయి రవాణా, విక్రయించవద్దని విజ్ఞప్తి చేశారు. సెక్యూరిటీ అడిగిన వారికి ఇస్తున్నామని అన్నారు. గిరిజనులు గంజాయి సాగు చేపట్టవద్దని అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇతర పంటల సాగుపై కూడా వారికి ట్రైనింగ్ ఇస్తున్నామని చెప్పారు. కాలేజ్‌ల్లో యువతకు అవగాహన కల్పిస్తున్నామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు.

# చదువుతోపాటు క్రీడల్లో రాణించండి

## రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగ సీతారాములు, తూము చౌదరి,

భద్రాద్రి కొత్తగూడెం, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆమేచూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇక్కడి 3 ఇంక్లైన్ లోని తెలంగాణ క్రీడ మైదానం నందు ఖమ్మం ,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను నిర్వహించడం జరిగింది ఈ పోటీలలో ఉభయ జిల్లాలలోని పలు మండలాలకు చెందిన 150 మంది బాల,బాలికలు ఈ పోటీల్లో పాల్గొనగా ఇందులో రాష్ట్ర జాతీయ స్థాయిలో పథకాలు గెలుపొందిన క్రీడాకారులు పాల్గొనడం విశేషం ఉదయం జరిగిన రెజ్లింగ్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా క్రీడాధికారి పరందామ రెడ్డి పోటీలను లాంచనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా పరందామ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అన్ని రకాల క్రీడలకు సంబంధించి కలెక్టర్ సహకారంతో శిక్షణ సామాగ్రి అందజేయడం జరిగింది రెజ్లింగ్ క్రీడకు కూడా కావలసిన శిక్షణ సౌకర్యాలను కూడా కలెక్టర్ త్వరలో ఏర్పాటు చేయనున్నారు ఇటీవల జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో కూడా అనేకమంది జిల్లా క్రీడాకారులు పతకాలు గెలుపొందడం జరిగింది అలాగే బాల,బాలికలు యువతీ, యువకులు పట్టుదలతో కృషిచేసి జాతియ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు గెలుపొంది జిల్లా ఖ్యాతిని చాటాలని, ప్రతిభవంతులైన క్రీడాకారులను కలెక్టర్ ఎంతగానో ప్రోత్సహిస్తారని ఆయన తెలిపారు అనంతరం

పోటీలు వయసు ,బరువును కేటగిరీలుగా విభజించి పలు విభాగాల్లో పోటీలు రాత్రి వరకు నిర్వహించగా క్రీడాకారులు పలువురు రాష్ట్ర ,జాతీయ స్థాయి క్రీడాకారులతో తలపడి అత్యంత ప్రతిభ కనబరిచి గెలుపొందగా అనంతరం జరిగిన బహుమతి ప్రధాన కార్యక్రమానికి టిపిసిసి సభ్యులు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు నాగ సీతారాములు ,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తూము చౌదరి , కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పెద్దన్న బాబు ,జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు జి యుగంధర్ రెడ్డి , పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు

ఈ సందర్భంగా టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తూము చౌదరి ,




మాట్లాడుతూ

బాల, బాలికలు యువతి యువకులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని తద్వారా చదువులో కూడా చురుకుదనం ఏర్పడుతుందని ఎంతో ఆరోగ్యంగా ఉంటామని క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తుందని దాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ పట్టుదలతో క్రీడల పట్ల ఆసక్తి కనబరిచి మంచి క్రీడాకారులుగా ఎదిగి మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాల్సిందిగా వీరు క్రీడాకారులకు సూచించారు

ఈ కార్యక్రమంలో ంజిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ .జి.యుగంధర్ రెడ్డి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీ హుస్సేన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.నిహారిక, జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షులు ఐ. ఆదినారాయణ శ్రీ ఇంక్లైన్ మాజీ సర్పంచ్ ఆంగోతి మోతి, ఎం.పి.టి.సి బోడ శారద,కోచ్ లు ఏ.వెంకటప్రసాద్, బి.తరుణ్, టీ.మానస,ఫిజికల్ డైరెక్టర్స్ మోతిలాల్, రవి, శ్వేత ,రజిని, రాకేష్, మహేష్ ,రజనీకాంత్, 3 ఇంక్లైన్ కాంగ్రెస్ కార్యకర్తలు గాంధీ, కుమార్, కొమురయ్య, కృష్ణ, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో మద్యం మాఫియా..!

**- ఆళ్లపల్లి లో మద్యం సిండికేట్ నడిపించేది ఎవరు...?**

**- జోరుగా మద్యం అమ్మకాలు..**

**-మండలంలో వందకు పైగా బెల్ట్ షాపులు..**



ఆళ్లపల్లి, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి ఏజెన్సీ మండలంలో పూర్తిగా ఆదివాసులు జీవనం కొనసాగిస్తుంటారు. ఇదే అదునుగా బెల్ట్ షాపులను మండలంలో జోరుగా నడిపిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మద్యం అమ్మకాలు జరుపుతూ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో వైన్ షాప్ ఒకటి ఉండగా అదేవిధంగా మర్కోడులో వైన్ షాప్ మాదిరిగా గోడం ఏర్పాటు చేసి బెల్ట్ షాపులకు సరఫార చేయడం విడ్డూరం గా ఉంది. బడి ,గుడి అని తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారు. దీన్ని అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు అధికారులు విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ వైన్ షాప్ ఎవరు కొనసాగిస్తున్నారు తెలియని పరిస్థితి మండలంలో ఉంది. వైన్ షాపులలో కొన్ని బ్రాండ్లు సైతం దొరకపోవడంతో సామాన్యులపై భారం పడుతుంది. మద్యం వైన్ షాప్ మండలంలో నడిపించేవారు సైతం తెలియకపోవడంతో ఎవర్ని అడగాలో అర్థం కాని పరిస్థితిలలో మందుబాబులు ఉన్నారు. వైన్ షాపులో ఎప్పుడు చూసినా డోర్ లాక్ చేయడంతో మద్యం ధరలు బెల్ట్ షాపులలో ఎక్కువ ధరకు అమ్మడంతో సామాన్యుల మందుబాబులపై భారీగా భారం పడుతుందని వాపోతున్నారు

# మృత చెందిన వశ్య

## మత్స్య సహకార సభ్యులు వశ్య మృతి



కారేపల్లి, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):దుబ్బతండా గిరిజన మత్స్యశాఖ సహకార సభ్యులు మేకలతండాకు చెందిన భూక్యా వశ్య(63)శనివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వశ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. గిరిజన మత్స్యసహకార సంఘం ఏర్పాటులో కీలక భూమిక పోషించిన వశ్యా 2011లో సహకార సంఘాన్ని ఏర్పాటు చేసి ఆ సంఘం ఆధ్వర్యంలో చెరువులలో చేపల పెంపకంను నిర్వహించి ఎందరికో ఆదాయవనరులు కల్పించారు. వశ్యా మృతికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు నివాళ్లు అర్పించారు.

# ప్రతి ఒక్కరు చికెన్ తినాలి కే బి ఎన్ చికెన్ యాజమాని - ఖలీల్




శేరిలింగంపల్లి, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):కొండాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ హఫీస్ పెట్ మెయిన్ రోడ్ లో వెన్ కబ్ చికెన్ ఎవర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు .కార్యక్రమంలో కేబీఎన్ చికెన్ యాజమాని ఖలీల్ మాట్లాడుతూ చికెన్ తినకూడదని దుష్ప్రచారం చేస్తున్నారని తద్వారా పౌల్ట్రీ రైతులకు డీలర్లకు డిస్ట్రిబ్యూటర్లకు కార్మికులకు చికెన్ షాపు వారికి ఎంతో అన్యాయం జరుగుతుందని చికెన్ 70 నుండి 90% ఉడికించిన చికెన్ లో ఎలాంటి వైరస్ ఉండదని ఇది ప్రజలు గమనించాలని సోషల్ మీడియా వాట్సాప్ గ్రూప్ లలో వచ్చే వదంతాలు నమ్మొద్దని ఆయన అన్నారు.

# కేటిఆర్ కి తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందించిన రవీందర్ యాదవ్




శేరిలింగంపల్లి, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):తెలంగాణ లో కేసీఆర్ పాలన మళ్ళీ రావాలి అని తిరుమల లో మొక్కులు చెల్లించి వచ్చిన బి ఆర్ ఎస్ సీనియర్ నేత రవీందర్ యాదవ్ బంజారాహిల్స్ లోని తెలంగాణ భవన్ లో కేటీఆర్ ను మర్యాద పూర్వకంగా కలిసి శ్రీ వారి ప్రసాదాన్ని ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ యాదవ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై ప్రజలు తీవ్రంగా వ్యతిరేకంగా ఉన్నారు అని అన్నారు . కేసీఆర్ పాలన లోనే రాష్ట్రం అభివృద్ధి చెందింది అని రవి కుమార్ యాదవ్ అన్నారు. వచ్చే ప్రతి ఎన్నికల్లో బి ఆర్ఎస్ విజయం సాధిస్తుంది అని రవీందర్ యాదవ్ తెలిపారు

# ప్రొఫెసర్ కోదండరాం కి పాలాభిషేకం చేసిన ఆర్ఎంపి పి.ఎం.పిలు

చెన్నరావుపేట, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):నర్సంపేట డివిజన్ ఆర్ఎంపి పి.ఎం.పి మిత్రులకు ఈరోజు ప్రొఫెసర్ డాక్టర్ కోదండరాం సార్ గారికి పాలాభిషేకం చేసే అటువంటి కార్యక్రమం కొరకు డాక్టర్ కోదండరాం సార్ ప్రభుత్వానికి ప్రభుత్వాలకు మధ్యవర్తిత్వం వహించి మనకున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే కార్యక్రమాన్ని తీసుకున్నారు కావున ఆయనపై జూనియర్ డాక్టర్స్ దిష్టిబొమ్మ దహన కార్యక్రమం ఆయనపై అనవసరమైన వ్యాఖ్యలకు నిరసన తెలుపుతూ సార్ కు నర్సంపేట డివిజన్ తరపున పాలాభిషేకం కార్యక్రమాన్ని చేయడం జరుగుచున్నది ఈ ప్రోగ్రాం ఒక పార్టీ నాయకులను ఒక పార్టీకి సపోర్ట్ చేయడం కోసమో కాదు కదా ఎవరు చేసినా ఆర్ఎంపీల మంచి జరగడం కోసమే కదా కావున అభిమానం ఉన్న ఆర్ఎంపీలు ఇట్టి కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా మనవి



# గ్రామస్తులకు సమాచారం లేకుండా కేవలం తెలిసిన వాళ్లతో ఉపాధి హామీ పనులు ప్రారంభించిన ఫీల్డ్ అసిస్టెంట్



చెన్నారావుపేట, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):వరంగల్ జిల్లా,చెన్నారావుపేట మండలం,ఉప్పరపల్లి గ్రామంలో గ్రామస్తులకు సమాచారం లేకుండా కేవలం తెలిసిన వాళ్లతో ఉపాధి హామీ పనులు ఫీల్డ్ అసిస్టెంట్ గుగులోతు రమేష్ ప్రారంభించాడని భూమిలేని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఫీల్డ్ అసిస్టెంట్ గుగులోతు రమేష్ కు అనుకూలంగా పనిచేసే వ్యక్తులకు మాత్రమే సమాచారాన్ని అందించి ఉపాధి హామీ పనులు ప్రారంభించాడని, మరి భూమిలేని రైతులు వారి జీవనం గడిచేది ఎలా అని ప్రశ్నించారు.

# జాటోత్ హుస్సేన్ నాయక్ నేషనల్ ఎస్సీ ఎస్టీ మెంబర్ మాజీ ఎంపీ సీతారాం నాయక్ ను మర్యాదపూర్వకంగా ఇంటి వద్ద కలవడం జరిగింది



హనుమకొండ , 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఈ రోజు మన నేషనల్ ఎస్టీ కమిషనర్ మెంబర్ అయినటువంటి జాటోతూ హుస్సేన్ నాయక్ ని ప్రశాంత్ నగర్ లోని మన రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారామ్ నాయక్ ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి మన అసోసియేషన్ డైరీ ని బహూకరించడం జరిగింది. మరియు మన కంపెనీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర సమస్యల గురించి చర్చించడం జరిగింది తదనంతరం మాజీ ఎంపీ చాడ సురేష్ రెడ్డి ని కలిసి మన అసోసియేషన్ డైరీ నీ బహుకరించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో మన రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ కంపెనీ అధ్యక్షులు వాలు నాయక్ కంపెనీ సెక్రటరీ శ్రీరామ్ నాయక్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రవి నాయక్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ తారాచంద్ కంపెనీ ట్రెజరర్ జవహర్ నాయక్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ నాయక్ హనుమకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శశినాయక్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీ ఎన్ నాయక్ జర్నలిస్ట్ భూక్య శ్రావణ్ కుమార్ లావణ్య రాజు నాయక్ మరియు గిరిజన ఉద్యోగులు పాల్గొనడం జరిగింది



# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బూట్లు సాక్షులు పంపిణీ




నెక్కొండ, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెక్కొండనందు ఈరోజు పాఠశాలలో చదువుతున్న 80 మంది విద్యార్థులకు నెక్కొండ ప్రాంత వాస్తవ్యులు చల్ల రఘోత్తంరెడ్డి బూట్లు మరియు సాక్సులు ఉచితంగా తమ సొంత నిధులను వెచ్చించి పంపిణీ చేయడం జరిగినది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాన్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంఈఓ రత్నమాల పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద మధ్యతరగతి విద్యార్థులకు యిటువంటి సౌకర్యాలను రఘోత్తంరెడ్డి కల్పించడం అభినందనీయమని ఇలాంటి కార్యక్రమాలుమిగతా వారికి స్ఫూర్తిదాయకంగా ఉంటాయన్నారు చాలామంది డబ్బులు కూడా పెట్టి పొదుపు చేయాలనుకుంటారు కానీ ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ఖర్చు పెట్టడం సహజంగా కొంతమందికే సాధ్యమని కొని ఆడారు ఇలాంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని ప్రస్తుత పరిస్థితులలో ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నందున తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించే విధంగా కృషి చేయాలని అన్నారు అన్ని పాఠశాలల కంటే నెక్కొండ ప్రాథమిక పాఠశాల ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం రంగారావు మాట్లాడుతూ డబ్బుతో పాటు సమాజసేవ కార్యక్రమాలు నిర్వహించేవారు కొంతమంది మాత్రమే ఉంటారని వారిని ఆదర్శంగా తీసుకొని పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో గోరంట్ల వెంకట నారాయణ నేతుల సారంగపాణి పొట్లపల్లి వీరస్వామి తాళ్లపల్లి భాస్కర్ గౌడ్

ఈదునూరి యాకయ్య చెన్నకేశవులు, కమలాకర్ రెడ్డి అల్లి యాదగిరి కృష్ణారావు మరియు పాఠశాల ఉపాధ్యాయులు బిక్షపతి భారతి మాలతి భద్రు రాజేందర్ కుమార్ ఐలయ్య వెంకటేశ్వర్లు పాల్గొన్నారు



# డయాబెటిస్ ఉన్నవాళ్లు తాగకూడని జ్యూస్‌లు

హెల్త్ న్యూస్, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ప్రస్తుత కాలంలో డయాబెటిస్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం.. అయితే.. డయాబెటిస్ ఉన్న రోగులు తాము తినే ఆహారంపై శ్రద్ధ వహించాలి.. లేకపోతే రక్తంలో చక్కెర పరిణామం పెరిగి.. ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది.. ఈ వ్యాధి నిర్వహణ.. ఆహారం .. జీవనశైలిపై చాలా ఆధారపడి ఉంటుంది. మీరు మీ ఆహారంలో కొంచెం మార్పు చేసినా, దాని పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది. అటువంటి పరిస్థితిలో, మీరు డయాబెటిస్ రోగి అయితే, మీ ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాన్ని మాత్రమే తినాలి. డయాబెటిక్ రోగులు ఆకు కూరలు, పండ్లు తినమని వైద్యులు సలహా ఇచ్చినప్పటికీ.. డయాబెటిక్ రోగులు జ్యూస్‌లు తాగకుండా ఉండాలి. ఎందుకంటే చాలా పండ్లలో అధిక మొత్తంలో చక్కెర ఉంటుంది. జ్యూస్ తాగడం వల్ల చక్కెర స్థాయిలు వేగంగా పెరిగే అవకాశం ఉంటుంది.



డయాబెటిస్ రోగులు కొన్ని పండ్ల రసం తాగకుండా ఉండాలని సూచించారు..

**నారింజ:** నారింజలో చక్కెర శాతం ఎక్కువగా ఉంటుంది. చాలా మంది ఉదయం నారింజ రసం తాగడానికి ఇష్టపడతారు. నారింజ రసంలో సహజ చక్కెర అధికంగా ఉంటుంది. అదే సమయంలో, మీరు ఒక నారింజ పండును పూర్తిగా తింటే, అందులో ఎక్కువ ఫైబర్ ఉంటుంది. అందువల్ల, దాని రసం తాగే బదులు, మొత్తం నారింజ పండును తినడం మంచిది.

**పైనాపిల్:** పైనాపిల్‌లో సహజ చక్కెర చాలా ఎక్కువ మొత్తంలో ఉంటుంది. దీనితో పాటు, దాని గ్లైసెమిక్ సూచిక కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. అంటే ఇది రక్తంలో చక్కెరను వేగంగా పెంచుతుంది. అందువల్ల, దీన్ని పూర్తిగా తినడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో, మీరు పైనాపిల్ ను మామూలుగా తింటే మీకు ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయి.

**ఆపిల్:** ఆపిల్ తినడం వల్ల అనేక వ్యాధులు నయమవుతాయని అంటారు. ఆపిల్స్ ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.. కానీ దానిని పూర్తిగా తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. దీని జ్యూస్ తాగడం వల్ల రక్తంలో చక్కెర పెరుగుతుంది. ఎందుకంటే అందులో సహజ చక్కెర ఎక్కువగా ఉంటుంది.. ఆపిల్ జ్యూస్ తాగడం వల్ల చక్కెర స్థాయిలు పెరుగుతాయి.

**ద్రాక్ష:** ద్రాక్షలో కూడా అధిక మొత్తంలో చక్కెర ఉంటుంది. అయితే, ద్రాక్షలో యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. అందువల్ల, దీనిని పరిమిత పరిమాణంలో తినాలి.. కానీ దాని రసం తీసి ద్వారా త్రాగడం ప్రయోజనకరంగా ఉండకపోవచ్చు.

**డయాబెటిస్ రోగులు ఈ జ్యూస్‌లు తాగితే మంచిది..**

**కాకరకాయ –** కాకరకాయ రసం మధుమేహ రోగులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

**సొరకాయ –** మధుమేహ రోగులకు సొరకాయ ప్రయోజనకరంగా ఉంటుంది. దీని రసం తాగడం వల్ల చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది.


**కీర దోసకాయ–** దోసకాయ పుదీనా రసం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. వాటి రసం తాగడం వల్ల చక్కెర స్థాయి పెరగదు. ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది.

# అధిక రక్తపోటును అదుపులోకి తెచ్చే పదార్థాలు



హెల్త్ న్యూస్, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):పనిభారం, ఒత్తిడి, ఇతర ఆందోళనలు వల్ల చాలామంది హైబీపితో బాధపడుతున్నారు. దీనితో తీవ్రమైన గుండెజబ్బులతో పాటు పలు అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఈ అధిక రక్తపోటును అదుపులో పెట్టకపోతే ఆరోగ్యపరంగా తీవ్రమైన సమస్యలు సృష్టిస్తుంది. అందువల్ల ఈ క్రింది పదార్థాలను తింటుంటే రక్తపోటు అదుపులో వుంటుంది. అవేమిటో తెలుసుకుందాము.పొటాషియం పుష్కలంగా వున్న కొబ్బరి నీరు తాగినా బీపీ నియంత్రణలోకి వస్తుంది.పుచ్చకాయలో రక్తం గడ్డకట్టకుండా చూసే గుణం వుంది, వీటిని తింటుంటే బీపీ అదుపులోకి వస్తుంది.కొత్తిమీరలోని యాంటీ ఇంఫ్లమేటరీ, యాంటీ డిప్రెసెంట్ గుణాలు బీపీని కంట్రోల్ చేయగలవు.ద్రాక్ష పండ్లలోని ఫాస్పరస్, పొటాషియం వల్ల కిడ్నీలు ఆరోగ్యంగా వుండటమే కాకుండా బీపీ అదుపులో వుంటుంది.హైబీపి వున్నవారు ఒక్క అరటి పండు తింటున్నా బీపీ అదుపులోకి వస్తుంది.పెద్దవుల్లిపాయలు కూడా అధిక రక్తపోటును అదుపుచేయడంలో దోహదపడతాయి.వెల్లుల్లిని ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల రక్తనాళాల్లో పేరుకుపోయిన కొవ్వును తొలగించి ఆరోగ్యవంతంగా వుంచుంది.హైబీపీ వున్నవారు నిమ్మరం తాగుతుంటే రక్తపోటు అదుపులోకి వస్తుంది.

# ఈ లక్షణాలు కనిపిస్తే గుండె నరాలు మూసుకుపోయినట్లేనా..?



హెల్త్ న్యూస్, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):గుండె ధమనులలో రక్తం గడ్డకట్టడం, వాపు, రక్త ప్రసరణ సరిగా లేకపోవడం ప్రారంభమైనప్పుడు గుండెకు ఆక్సిజన్ అందకపోవడం ప్రారంభమవుతుంది. దీనివల్ల గుండె ధమనులు మూసుకుపోతాయి. దీని ప్రారంభ లక్షణాలు చెమటలు పట్టడం, ఛాతీ నొప్పి, నిరంతర నొప్పి మొదలైనవి. వీటిలో గుండెపోటు, కరోనరీ ఆర్టరీ వ్యాధి (CAD), గుండె కండరాల వ్యాధి, గుండె కవాట వ్యాధి, మందుల దుష్ప్రభావాలు ఉన్నాయి. సీఏడీ అనేది గుండె కండరాలకు రక్త ప్రవాహాన్ని పరిమితం చేసే ఒక పరిస్థితి. అలాగే ఇది గుండెపోటు, అసాధారణ గుండె లయ లేదా గుండె వైఫల్యానికి దారితీస్తుంది.


గుండె ధమనులలో తీవ్రమైన అడ్డంకులు ఏర్పడితే, శరీరంపై వివిధ లక్షణాలు కనిపించడం ప్రారంభిస్తాయి. ఇది రోగులకు తల తిరుగుతున్నట్లు అనిపించడంతో ప్రారంభమవుతుంది. ఇది తీవ్రమైన, సాధారణ సమస్య. అందువల్ల దానిని విస్మరించడం చాలా కష్టం. గుండె ఆగిపోవడం వల్ల శరీరం అనేక సమస్యలను ఎదుర్కొంటుంది.

హార్ట్ బ్లాక్ అనేది ఒక సమస్య. దీనిలో హృదయ స్పందన సిగ్నల్ మీ గుండెపై గదుల నుండి మీ గుండె దిగువ గదులకు సరిగ్గా ప్రయాణించదు. సాధారణంగా స్పందన సంకేతాలు మీ గుండె పై గదులు (కర్ణిక) నుండి కింది గదులకు (జఠరికలు) ప్రయాణిస్తాయి.

సిగ్నల్ మీ AV నోడ్ గుండా వెళుతుంది. ఇది మీ పై గదుల నుండి మీ దిగువ గదులకు విద్యుత్ కార్యకలాపాలను అనుసంధానించే కణాల సమూహం. మీకు హార్ట్ బ్లాక్ ఉంటే సిగ్నల్ అరుదుగా మీ జఠరికలను చేరుతుంది. గుండెపోటుకు దారితీసే మూసుకుపోయిన ధమని మొదటి లక్షణం ఛాతీ నొప్పి కావచ్చు. ఒక వ్యక్తికి హార్ట్ బ్లాక్ సమస్య వచ్చినప్పుడు, వారికి మొదట ఛాతీ నొప్పి వస్తుంది. అందుకే ఛాతీ నొప్పిని విస్మరించకూడదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# పిల్లల్లో చెవి ఇన్ఫెక్షన్లు..

హెల్త్ న్యూస్, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): పిల్లలకు చెవి ఇన్ఫెక్షన్లు రావడం సాధారణం. చెవి ఇన్ఫెక్షన్లు వచ్చినప్పుడు నిరంతరం చెవి నొప్పి, చెవిలో గులిమి వంటి సమస్యలు వస్తాయి. ఇవి భరించలేని నొప్పిని కలిగిస్తాయి. అంతేకాకుండా జ్వరానికి కూడా దారితీస్తుంది. కాబట్టి, పిల్లలకు సరైన చికిత్స అందించడం చాలా ముఖ్యం. అయితే, చెవి ఇన్ఫెక్షన్లను వదిలించుకోవడానికి కొన్ని చిట్కాలు కూడా ఉన్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..



**తల్లిపాలు ..**

బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువుకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శిశువును చెవి ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది.

**టీకాలు ..**

చెవి ఇన్ఫెక్షన్లను నివారించడానికి పిల్లలకు టీకాలు వేయవచ్చు. న్యూమోనియా మెనింజైటిస్ వల్ల కలిగే చెవి ఇన్ఫెక్షన్లను నివారించడానికి టీకాలు సహాయపడతాయి

**సురక్షితమైన చికిత్స**

చెవి ఇన్ఫెక్షన్లు ఉన్న పిల్లలకు సురక్షితమైన చికిత్స అందించడం చాలా ముఖ్యం. దాదాపు 80% చెవి ఇన్ఫెక్షన్లు మందులు లేకుండానే తగ్గిపోతాయి.

**యాంటీబయాటిక్ క్రీములు**

వైద్యులు సూచించిన యాంటీబయాటిక్ క్రీములను చెవులకు ఉపయోగించవచ్చు. చెవి ఇన్ఫెక్షన్ల వల్ల కలిగే లక్షణాలను తగ్గించడానికి ఈ మందులను ఉపయోగిస్తారు.

**చెవి నొప్పి నివారణ మందులు**

కొన్నిసార్లు చెవి ఇన్ఫెక్షన్లు భరించలేని నొప్పిని కలిగిస్తాయి. జ్వరానికి కూడా దారితీస్తాయి. చెవి నొప్పిని తగ్గించడానికి ఎసిటమైనోఫెన్ లేదా ఇబుప్రోఫెన్ వంటి నొప్పి నివారణ మందులు ఇవ్వవచ్చు. మందులు తీసుకున్న వారం లోపు ఇన్ఫెక్షన్ తగ్గిపోతుందో లేదో గమనించాలి. ఇన్ఫెక్షన్ తీవ్రంగా ఉంటే వైద్యుడిని సంప్రదించండి.

**నోటి మందులు**

చెవి ఇన్ఫెక్షన్లు తీవ్రంగా ఉంటే కొన్ని నోటి యాంటీబయాటిక్స్ వాడితే ప్రయోజనం ఉంటుంది. ఇవి నొప్పిని తగ్గించడానికి ఉపయోగిస్తారు.

**దుష్ప్రభావాలు**

డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా తరచుగా యాంటీబయాటిక్స్ ఇవ్వకూడదు. యాంటీబయాటిక్స్ తరచుగా తీసుకోవడం వల్ల వికారం, విరేచనాలు, కడుపు నొప్పి, దద్దుర్లు లేదా మంట వస్తుంది.

# క్రీడలు



## భారత్‌తో మ్యాచ్.. స్పెషల్ కోచ్‌ను నియమించుకున్న పాకిస్తాన్ టీమ్..!



స్పోర్ట్స్ న్యూస్, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):క్రికెట్ ప్రేమికులు ఎంతో ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ మరికొద్ది గంటల్లో ప్రారంభం కాబోతోంది. ఛాంపియన్స్ ట్రోఫీలో మరో కీలక సమరానికి రంగం సిద్ధమవుతోంది. రసవత్తర మ్యాచ్ కోసం దాయాది దేశాలు సిద్ధమవుతున్నాయి. ఆదివారం దుబాయ్‌లో జరిగే మ్యాచ్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు తలపడుతున్నాయి. ఇప్పటికే న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు ఓడిపోయింది. దీంతో భారత్‌తో ఆదివారం జరిగే మ్యాచ్ ఆ జట్టుకు కీలకం కానుంది.

ఆదివారం భారత్‌తో జరిగే మ్యాచ్‌లో కూడా ఓటమి పాలైతే ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి పాకిస్తాన్ దాదాపు నిష్క్రమించినట్టే. అందుకే ఈ మ్యాచ్‌ను పాకిస్తాన్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. జట్టు సభ్యులకు శిక్షణ ఇచేందుకు ఓ స్పెషల్ కోచ్‌ను కూడా నియమించింది. ఇప్పటికే పాక్ క్రికెట్ టీమ్‌కు తాత్కాలిక్ హెడ్ కోచ్‌గా ఉన్న సెలెక్టర్ అకిబ్ జావేద్ తనకు సహాయం అందించేందుకు మరో వ్యక్తిని నియమించుకున్నాడు. మాజీ సహచరుడు ముదస్సర్ నాజర్‌ను తాత్కాలికంగా స్పెషల్ కోచ్‌గా నియమించాడు. ముదస్సర్‌కు యూఏఈ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉంది. దీంతో అతడి సహాయం తీసుకునేందుకు అకిబ్ నిర్ణయించుకున్నాడు.

అకిబ్ విజ్ఞప్తి మేరకు ముదస్సర్ శుక్రవారం పాకిస్తాన్ జట్టుతో కలిశాడు. ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొని జట్టు సభ్యులకు శిక్షణ ఇచ్చాడు. యూఏఈ పరిస్థితుల గురించి ఆటగాళ్లకు అవగాహన కల్పించే ప్రయత్నం చేశాడు. కాగా, ముదస్సర్ గతంలో పలుసార్లు పాకిస్తాన్ జట్టుకు కోచ్‌గా సేవలందించాడు. ఆ తర్వాత కెన్యా, యూఏఈ టీమ్‌లకు కూడా కోచ్‌గా పని చేశాడు. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ అయిన ముదస్సర్ పాకిస్తాన్ తరఫున 76 టెస్టులు ఆడి 4114 పరుగులు, 122 వన్డేల్లో 2653 పరుగులు చేశాడు.

## సన్‌రైజర్స్ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్.. కెప్టెన్ కమిన్స్ ఆగయా..!

స్పోర్ట్స్ న్యూస్, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రారంభమైంది. అయితే ప్రతీ ఐసీసీ టోర్నీలో బలంగా కనిపించి.. టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగే ఆస్ట్రేలియా ఈసారి కాస్త బలహీనంగా కనిపిస్తోంది. కీలక ఆటగాళ్లు దూరమవడం ఆ జట్టు కూర్పుపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా వన్డే ప్రపంచకప్ 2024, ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ లాంటి టోర్నీలో జట్టును జగజ్జేతగా నిలిపిన కెప్టెన్ ప్యాట్ కమిన్స్ లేకపోవడంతో ఆ జట్టు బౌలింగ్ బలహీనంగా కనిపిస్తోంది.




గాయం కారణంగా ప్యాట్ కమిన్స్.. ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. భారత్‌తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఆడిన ఆస్ట్రేలియా కెప్టెన్.. ఆ తర్వాత క్రికెట్‌కు దూరమయ్యాడు. దీంతో అతడు కోలుకునేందుకు ఎన్నిరోజులు పడుతుందని ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక వచ్చే నెల 22 నుంచి ఐపీఎల్ 2025 ప్రారంభం కానుంది. ఐపీఎల్‌లో కమిన్స్ సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. గతేడాది సన్ రైజర్స్ ఫైనల్ వరకూ వెళ్లిందంటే.. అందుకు ప్రధాన కారణం కమిన్స్. అలాంటి కెప్టెన్ ఈసారి లేకపోతే ఎలా అని ఆరెంజ్ ఆర్మీ బాధలో ఉంది.

ఐపీఎల్‌కు మరో నెలరోజుల సమయం ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో సన్ రైజర్స్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ అందింది. కమిన్స్ ఐపీఎల్ 2025 బరిలోకి దిగే అవకాశం ఉందట. మరికొన్ని రోజుల్లోనే అతడు తిరిగి బౌలింగ్ ప్రాక్టీస్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా వర్గాలు ధ్రువీకరించాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్‌కు ముందు ఐపీఎల్ ఆడాలని కమిన్స్ డిసైడ్ అయినట్లు తెలిపాయి. టీ20ల్లో ఒక్కో బౌలర్ గరిష్టంగా నాలుగు ఓవర్లు మాత్రమే వేస్తాడు. దీంతో శరీరంపై పెద్దగా ప్రభావం పడదని కమిన్స్ భావిస్తున్నాడట. ఏది ఏమైనా.. ప్యాట్ కమిన్స్ తిరిగి వస్తే.. సన్ రైజర్స్ మరింత బలంగా మారుతుందనడంలో సందేహం లేదు.

31 ఏళ్ల ప్యాట్ కమిన్స్.. ఐపీఎల్‌లో ఇప్పటివరకూ 58 మ్యాచులు ఆడాడు. అదులో 63 వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లోనూ 515 రన్స్ స్కోరు చేశాడు. మార్చి 22 నుంచి మే 25 వరకు ఐపీఎల్ 2025 జరగనుంది. సన్ రైజర్స్ హైదరాబాద్ తన తొలి మ్యాచ్‌లో మార్చి 23న రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది.

## ఆ ఇద్దరిని త్వరగా అవుట్ చేస్తేనే..!

### భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌లో గెలుపు ఎవరిదో చెప్పిన మాజీ కెప్టెన్ ఇంజమామ్..!

స్పోర్ట్స్ న్యూస్, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం భారత్-పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరుగనున్నది. దుబాయి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరుగనున్న మ్యాచ్ కోసం క్రికెట్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంగా మ్యాచ్‌పై పలువురు మాజీలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆఫీషియల్ బ్రాడ్‌కాస్టర్ నిర్వహించిన కార్యక్రమంలో మాజీ క్రికెటర్లు ఇంజమామ్ ఉల్ హక్, షాహిద్ అఫ్రిది, యువరాజ్ సింగ్, నవజ్యోత్ సింగ్ సిద్ధూ వంటి దిగ్గజాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంజమామ్ ఉల్ హక్ భారత్-పాక్ మ్యాచ్‌లో ఏ జట్టు విజయం సాధిస్తుందో జోష్యం చెప్పారు. రెండు దేశాల మధ్య మ్యాచ్ అంటే ఎప్పుడూ ఆటగాళ్లపై ఒత్తిడి ఉంటుందన్నారు.




సంవత్సరానికి ఒకేసారి మ్యాచ్ జరుగుతుండడంతో ఒత్తిడి పెరుగుతుందని.. చాలా మ్యాచులు జరిగితే ఆటగాళ్లు ఒకరినొకరు దగ్గరగా ఉంటారని పేర్కొన్నారు. మ్యాచ్‌లో ఏ జట్టు సమతూకంగా ఉంటుందో.. ఆ జట్టు మ్యాచ్‌లో పైచేయి సాధించేదని.. టీ20 క్రికెట్ కారణంగా ఆట వ్యక్తిగతంగా మారిందన్నారు. ఒక ఆటగాడే మ్యాచ్ గమనాన్నే మారుస్తున్నాడని చెప్పారు. ఇటీవల భారత జట్టు బలంగానే ఉందన్నారు. ముఖ్యమంగా రవీంద్ర జడేజా, హార్దిక్ పాండ్యా వంటి ఆల్ రౌండర్ల కారణంగా లోయర్ ఆర్డర్‌లో జట్టు సమతూకంగా ఉందని పేర్కొన్నారు. ఈ సారి మ్యాచ్‌లో అన్నింట్లో సమతూకంగా ఉన్న జట్టే పైచేయి సాధిస్తుందని చెప్పారు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, సీనియర్ ప్లేయర్ విరాట్ కోహ్లీపై ఇంజమామ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఇద్దరు ప్లేయర్ బెస్ట్ ప్లేయర్స్ అనడంలో సందేహం లేదని.. ఇద్దరూ దాదాపు 20 సంవత్సరాలుగా నిలకడగా రాణిస్తున్నారని.. జట్టుపై వీరిద్దరి ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని తెలిపాడు.

వీరిద్దరు త్వరగా అవుట్ అయితే భారత డ్రెస్సింగ్ రూమ్‌లో గణనీయంగా మార్పు ఉంటుందని.. దాంతో పాక్ జట్టు మనోధైర్యం పెంచుతుందని మాజీ కెప్టెన్ పేర్కొన్నారు. మిగతా భారత ఆటగాళ్లు బాగా ఆడరనేది దానర్థం కాదని.. టీమిండియాలో చాలామంది ప్రతిభావంతులైన ప్లేయర్స్ ఉన్నారని.. వారంతా ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నారన్నారు. పాక్ ఆటగాడు బాబర్ ఆజం త్వరగా అవుట్ అయితే.. ప్రత్యర్థి బౌలర్ల అంచనాలు పెరుగుతాయని.. పాకిస్థాన్ డ్రెస్సింగ్ రూమ్‌లో ఒత్తిడి పెరుగుతుందన్నారు. పాకిస్తాన్ గెలవాలంటే.. లోయర్, మిడిల్ ఆర్డర్ రాణించాలని.. రోహిత్, విరాట్ ఇద్దరి వికెట్లను త్వరగా తీస్తే.. పాకిస్థాన్‌కు లాభిస్తుందని ఇంజమామ్ వివరించారు.

## 60 బంతుల్లో రోహిత్ శర్మ సెంచరీ కొడుతాడు.. పాకిస్థాన్‌తో మ్యాచ్ వేళ యువరాజ్ అంచనా




స్పోర్ట్స్ న్యూస్, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం పాకిస్థాన్, ఇండియా మధ్య హై వోల్టేజ్ మ్యాచ్ జరగనున్నది. అయితే ఆ మ్యాచ్‌కు ముందు.. మాజీ దిగ్గర బ్యాటర్ యువరాజ్ సింగ్ ఓ అంచనా వేశారు. ప్రస్తుతం రోహిత్ శర్మ ఫామ్‌లో లేకున్నా.. అతను మ్యాచ్ విన్నర్ అని యువీ పేర్కొన్నాడు. జియోహాట్‌స్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతను ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వన్డే క్రికెట్‌లో ఓ బ్యాటర్‌గా రోహిత్ పెద్ద మ్యాచ్ విన్నర్ అని, రోహిత్ ప్రస్తుతం ఇబ్బంది పడుతున్నా, అతను పరుగులు సాధిస్తున్నాడని, ఇది ప్రత్యర్థికి ప్రమాదకరమే అని, ఒకవేళ అతను ఫామ్‌లో ఉంటే, 60 బంతుల్లోనే రోహిత్ సెంచరీ కొట్టగలడని, అది అతని నాణ్యత అని యువీ తెలిపాడు. ఒకవేళ కొట్టుడు స్టార్ట్ చేస్తే, ఫోర్లు కాదు, అతను సిక్సర్లతో చెలరేగుతాడని, షార్ట్ బాల్స్ ఆడడంలో అతను దిట్ట అని, 150 కిలోమీటర్ల వేగంతో వేసినా, అతను అలవోకగా స్ట్రయిక్ చేస్తాడని చెప్పాడు. సింగిల్ హ్యాండెడ్‌గా మ్యాచ్‌ను గెలిపించే సత్తా రోహిత్‌కు ఉందని యువీ తెలిపాడు.

ఆదివారం జరిగే మ్యాచ్‌లో మాత్రం పాకిస్థాన్‌కు అడ్వాంటేజ్ ఉందన్నాడు. ఎందుకంటే దుబాయ్‌లో పాకిస్థాన్‌కు ఎక్కువ ఆడిన అనుభవం ఉందని, అక్కడి కండీషన్స్ ఆ జట్టుకు బాగా తెలుసు అని, స్లో వికెట్లపై ఇండియా, పాక్ ప్లేయర్లు బాగా ఆడుతారని, స్పిన్ బౌలర్లను ఇరు జట్లు బాగా ఆడుతాయని, కాకపోతే భారత జట్టులో మ్యాచ్ విన్నర్లు ఎక్కువగా ఉన్నట్లు యువీ చెప్పాడు. పాక్ వద్ద కూడా మ్యాచ్ విన్నర్లు ఉన్నారని, కానీ ఆ రోజు ఆడే పరిస్థితిని బట్టి విజేత తెలుస్తాడని పేర్కొన్నాడు.

KR TV క్రాంతి
ఆదివారం 23 ఫిబ్రవరి 2025

# సినిమా న్యూస్

epaper.krtvnews.com

## నాని ప్లానింగ్ సూపర్

మూవీ న్యూస్, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):చిన్న స్థాయి నుంచి నేచురల్ స్టార్ గా ఎదిగాడు నాని. హీరోగా తాను సూపర్ సక్సెస్. నిర్మాతగానూ అంతే. వాల్ పోస్టర్ బ్యానర్ నుంచి వచ్చిన ఏ సినిమా నానినే కాదు, ప్రేక్షకుల్నీ నిరుత్సాహపరచలేదు. ముఖ్యంగా చిన్న సినిమాల్ని మంచి ప్లానింగ్ తో తీస్తుంటాడు నాని. వాటిని ప్రమోట్ చేసుకొనే విధానం కూడా బాగుంటుంది. వాల్ పోస్టర్ బ్యానర్ నుంచి వస్తున్న మరో సినిమా 'కోర్ట్' ఇందుకు మరో ఉదాహరణ.ప్రియదర్శి కథానాయకుడిగా నటించిన సినిమా ఇది. మార్చి 14న విడుదల అవుతోంది. ఫస్ట్ కాపీ కూడా రెడీ అయ్యింది. విడుదలకు మరో 3 వారాల సమయం ఉంది. అయినా సరే, ఇప్పటి నుంచే ప్రమోషన్లు మొదలెట్టేశాడు. ఈ సినిమా ఓటీటీ డీల్ ఎప్పుడో క్లోజ్ అయ్యింది. దాదాపు రూ.9 కోట్లు నెట్ ఫిక్స్ సంస్థ ఈ సినిమాని కొనేసింది. ప్రియదర్శి రెమ్యునరేషన్ రూ.2 కోట్లు. మిగిలిన పారితోషికాలు. మేకింగ్ కోసం రూ.4 కోట్లు అవుతుందనుకొన్నా.. రూ.6 కోట్లలో సినిమా పూర్తవుతుంది. మరో రూ.3 కోట్లు లాభం. ఇది కేవలం ఓటీటీ డీల్



మాత్రమే. శాటిలైట్ డీల్ ఇంకా క్లోజ్ అవ్వలేదు. థియేటర్ నుంచి వచ్చిందంతా లాభమే. చిన్న సినిమా, విడుదలకు ముందే లాభాలు, రిలీజై మంచి పేరొస్తే, ఆ క్రెడిట్..మొత్తానికి నాని ప్లానింగ్ సూపర్ గా ఉంది. యంగ్ హీరోలంతా ఇలా ప్లానింగ్ తో సినిమాలు తీసుకొంటే.. కొత్త కథలకు, కొత్తతరానికి ప్రోత్సాహం ఇచ్చినవాళ్లవుతారు. ప్రమోషన్ ప్లానింగ్ కూడా బాగుంది. విడుదలకు ముందే ప్రీమియర్లు గట్టిగా వేయాలనుకొంటున్నాడు. సెలబ్రెటీ షోలు, వాళ్ల రివ్యూలతో పాజిటీవ్ బజ్ వస్తే థియేటర్లకు వెళ్లాలన్న ఉత్సాహం కలుగుతుంది. ప్రియదర్శికి కూడా 'బలగం' లాంటి హిట్ చేతిలో ఉంది. కాబట్టి మంచి టాక్ వస్తే, వసూళ్లు దక్కించుకోవొచ్చు.

## భం భం శివ..


మూవీ న్యూస్, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం 'భైరవం'. అదితిశంకర్, ఆనంది, దివ్య పిళ్లై కీలక పాత్రలు పోషిస్తున్నారు. విజయ్ కనకమేడల దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మాత. జయంతిలాల్ గడ సమర్పకులు. వేసవి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. మహా శివరాత్రి సందర్భంగా 'భం భం శివ...' అంటూ సాగే ఇందులోని పాటని శుక్రవారం విడుదల చేశారు. చైతన్య ప్రసాద్ రచించిన ఈ పాటని, శంకర్ మహదేవన్ ఆలపించారు. శ్రీచరణ్ పాకాల స్వరకర్త. ఆధ్యాత్మిక శక్తిని చాటే ఈ పాట చిత్రీకరణ కూడా ఆకట్టుకుంటుందని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: హరి కె.వేదాంతం.





## చాలా బాగున్నావు..

మూవీ న్యూస్, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): సాధారణంగా సినిమా పరిశ్రమలో ఒక హీరోయిన్ని మరో హీరోయిన్ పొగడటం అరుదు. కానీ అలియా భట్ మాత్రం ఇగో పక్కన పెట్టి, తన తోటి హీరోయిన్ రష్మిక మందన్నాను పొగడ్తలతో ముంచెత్తింది. విక్కీ కౌశల్, రష్మిక జంటగా నటించిన 'ఛావా' సినిమా ఇటీవలే విడుదలైన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా పాజిటివ్ టాక్‌తో భారీ వసూళ్లతో దూసుకుపోతున్న 'ఛావా'ను రీసెంట్‌గా అలియాభట్ చూసింది. వెంటనే ఇన్‌స్టా ద్వారా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. 'ఛావా' ఓ అద్భుతం. ముందుగా డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్‌కి అభినందనలు. చాలా గొప్పగా తీశారు. విక్కీకౌశల్ అద్భుతంగా నటించారు. నా అభిమాన నటుడు అక్షయ్ ఖన్నా ఔరంగజేబుగా మారిపోయారు. ఇక రష్మిక.. 'చాలా అందంగా ఉన్నావు.. ముఖ్యంగా నీ కళ్లు..' ' అంటూ ప్రశంసలు గుప్పించింది అలియా భట్. అలియా పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.



## శివశక్తిగా తమన్నా

మూవీ న్యూస్, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): తమన్నా ప్రధాన పాత్రధారిగా అశోక్‌తేజ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఓదెల 2' హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్.సింహ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంపత్ నంది టీమ్ వర్క్స్‌తో కలిసి మధు క్రియేషన్స్ పతాకంపై డి.మధు నిర్మిస్తున్నారు. తాజాగా ఈసినిమా టీజర్ ను చిత్రబృందం మహాకుంభమేళాలో విడుదల చేసింది. శివశక్తిగా తమన్నా నటన ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా సాగింది. ఉత్కంఠ రేకెత్తించే సన్నివేశాలతో టీజర్ ఆద్యంతం అలరించేలా ఉంది. 2022లో విడుదలైన 'ఓదెల రైల్వే స్టేషన్' చిత్రానికి కొనసాగింపుగా ఈ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే.



## భామ.. రామ..ప్రేమ

మూవీ న్యూస్, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): సుహాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. మాళవిక మనోజ్ కథానాయిక. రామ్ గోధల దర్శకత్వం వహిస్తున్నారు. వి ఆర్ట్స్ పతాకంపై హరీశ్ నల్ల నిర్మిస్తున్నారు. ప్రముఖ కథానాయకుడు రానా దగ్గుబాటి తన స్పిరిట్ మీడియా పతాకంపై ఈ వేసవిలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇందులో దర్శకుడు హరీశ్ శంకర్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఆయనపై ఇటీవలే సన్నివేశాల చిత్రీకరణని పూర్తి చేసినట్టు సినీవర్గాలు తెలిపాయి. నిర్మాత మాట్లాడుతూ "ప్రేమకథతో తెరకెక్కుతున్న చిత్రమిది. హాస్యం, భావోద్వేగాలు ఈ కథలో కీలకం. సుహాస్ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. ఇందులోని ఓ పాత్రని దర్శకుడు హరీశ్ శంకర్ చేస్తేనే బాగుంటుందని భావించి, ఆయన్ని సంప్రదించి ఒప్పించాం. సీనియర్ నటి హంసా నందిని, అలీ కూడా కీలక పాత్రల్లో మెరుస్తారు. ఈ వేసవికి ఇంటిల్లి పాదికీ వినోదం పంచే చిత్రమవుతుంది" అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: మణికందన్.ఎస్, సంగీతం: రధన్, కూర్పు: భవిన్ షా, ప్రొడక్షన్ డిజైన్: బ్రహ్మ కడలి.



## ధామాలో అతిథిగా శ్రద్ధ కపూర్?

మూవీ న్యూస్, 22 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ) గతేడాది 'స్త్రీ 2'తో బాలీవుడ్ బాక్సాఫీసు వద్ద రికార్డు సృష్టించింది అందాల తార శ్రద్ధా కపూర్. ఇప్పుడా జోరులోనే వరుస అవకాశాలను అందుకుంటోందామె. తాజాగా ఆమె మరో క్రేజీ ప్రాజెక్టును చేజిక్కించుకున్నట్లు తెలుస్తోంది. రష్మిక, ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'థామా'. ఆదిత్య సర్పోత్దార్ తెరకెక్కిస్తున్నారు. హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో శ్రద్ధా కపూర్.. 'స్త్రీ' సినిమా తరహాలోని పాత్రలో తళుక్కున మెరవనున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఈ విషయంపై ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దర్శకుడు ఆదిత్య స్పందిస్తూ.. "కథ విస్తరిస్తున్నప్పుడు కొన్ని ముఖ్యమైన పాత్రలు అందులో అడుగు పెట్టడం సహజం. సినిమా విడుదల దగ్గరయ్యే కొద్దీ నేను మీకు సర్‌ప్రైజ్‌లు ఇస్తుంటాను. వాటన్నింటినీ మీరే పసిగట్టాలని కోరుకుంటున్నా" అని అన్నారు. దీంతో ప్రేక్షకుల ఊహగానాలకు బలం చేకూరినట్లైంది.



Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com